

మరో ఐదు రోజుల పాటు వర్షాలు



ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో మరో ఐదు రోజుల పాటు మోస్తారు వర్షాలు కురుస్తాయని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 18వ తేదీన 16.6 మిల్లీమీటర్లు, 19వ తేదీన 20మి.మీ, 20వ తేదీన 10మి.మీ, 21వ తేదీన 15మి.మీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రత 30.6 డిగ్రీల సెల్సియస్ నుంచి 31.7 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రత 24.5 నుంచి 25.9 డిగ్రీల సెల్సియస్ ఉంటుందన్నారు. నైరుతి నుంచి పశ్చిమ దిశగా గాలులు గంటకు 9నుంచి 10కి.మీ వేగంతో వీస్తాయన్నారు. రైతులు ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

పరిశ్రమలకు పత్తి వాహనాల క్యూ



మార్కెట్ యార్డ్ నుంచి పక్కనే ఉన్న పరిశ్రమల్లోకి వెళ్లేందుకు క్యూ కట్టిన పత్తి వాహనాలు

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు పత్తి వాహనాలు క్యూ కడుతున్నాయి. ఖరీఫ్ సీజన్ పత్తి చేతికి రావడంతో విక్రయించేందుకు రైతులు బుధవారం భారీగా తరలివచ్చారు. అద్దె వాహనాల్లో ఆయా గ్రామాల నుంచి లూజు పత్తిని తీసుకురావడంతో ఉదయం టెండర్ వేసుకుని వ్యాపారులు పరిశ్రమలకు తరలించారు. మార్కెట్ యార్డ్ పక్కనే ఉన్న బీఎంబీజీ జన్నింగ్ పరిశ్రమ, ఐశ్వర్య కాటన్స్, ఆర్ఆర్‌జీ జిన్నింగ్ పరిశ్రమకు తూకాలు వేసుకుని అన్‌లోడ్ చేసుకోవడానికి వాహనాలు బారులుదీరాయి.

ముగిసిన బార్ల దరఖాస్తుల ప్రక్రియ

- నేడు జడ్పీలో లాటరీ పద్ధతిన ఎంపిక



కర్నూలు అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏడు లైసెన్స్ బార్లకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. బుధవారం చివరి రోజు కావడంతో కర్నూలు-4, ఎమ్మిగనూరు-1 బార్‌కు 20 దరఖాస్తులు వచ్చాయి. ఎమ్మిగనూరు, గూడూరుల్లోని రెండు బార్లకు దరఖాస్తులు వేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో జిల్లాలో 26బార్లకు నూతన బార్ లైసెన్స్‌కి నోటిఫికేషన్ జారీ చేయగా మొదటి విడతలో 19 బార్లకు లైసెన్స్ ప్రక్రియ పూర్తయింది. మిగిలిన బార్ల కోసం గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కలెక్టర్ చేతుల మీదుగా ఎంపిక లాటరీ పద్ధతిన ఎంపిక చేయనున్నారు.

స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు

- పార్కు స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన మున్సిపల్ అధికారులు



పట్టణంలోని ఎస్ఎంటీ కాలనీలో పార్కుకోసం వదిలిన స్థలంలో బోర్డు ఏర్పాటు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని స్థలం కబ్జా చేయడంపై 'మున్సిపల్ స్థలం కబ్జా' అనే శీర్షికతో ఈనెల 1న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఎస్ఎంటీకాలనీలో సర్వే నం 447-సిలో పార్కు కోసం వదిలిన రూ. 2కోట్ల విలువైన 22 సెంట్ల స్థలంలో 8సెంట్ల స్థలాన్ని ఓ వైసీపీ నాయకుడు, మాజీ ప్రజాప్రతినిధి అక్రమంగా విక్రయించి వేరొకరికి రిజిస్ట్రేషన్ చేయించిన విషయాన్ని వెలుగులోకి తెచ్చింది. ఎట్టకేలకు మున్సిపల్, రిజిస్ట్రేషన్ అధికారులు స్పందించారు. అక్రమ రిజిస్ట్రేషన్ విషయం వెలుగులోకి వచ్చిన వెంటనే మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పార్కుకోసం వదిలిన స్థలాన్ని రిజిస్టర్ చేశారని, దీన్ని రద్దుచేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్, స్థానిక సబ్ రిజిస్ట్రార్‌కు లేఖలు పంపారు. దీంతో స్పందించిన ఎమ్మిగనూరు సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు ఈనెల 9న అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినవారికి, చేయించుకున్న వారికి వెంటనే రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసుకోవాలని నోటీసులు పంపారు. అయితే వారి నుంచి ఇప్పటి వరకు వారు స్పందించలేదు. అయితే మున్సిపల్ అధికారులు బుధవారం ఎస్ఎంటీ కాలనీలోని పార్కు స్థలంలో బోర్డు ఏర్పాటు చేశారు. ఇది మున్సిపాలిటీకి చెందిన స్థలమని దీన్ని ఎవరైన ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోబడునని కమీషనర్ పేరుతో బోర్డు ఏర్పాటు చేశారు.

నోటీసులతో సరిపెట్టుకుంటున్న అధికారులు

రూ.రెండు కోట్ల విలువైన స్థలం ఆక్రమంగా రిజిస్ట్రేషన్ జరిగినా మున్సిపల్, సబ్ రిజిస్ట్రేషన్ అధికారులు తూతూ మంత్రంగా నోటీసులు, బోర్డులతో సరిపెట్టుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ రిజిస్ట్రేషన్ జరిగి దాదాపు 48 రోజులు గడుస్తున్నా పూర్తి స్థాయిలో తీసుకోవాల్సిన చర్యలు తీసుకోకుండా అరకొర చర్యలతోనే సరిపెడుతూ వస్తున్నారు. ఇప్పటి వరకు స్థలంలో పాతిన బండలను తొలగించకపోటం పలు అనుమానాలకు తావిస్తోంది.



ఉబికి వస్తున్న కన్నీళ్లు..!



మా రైతుల కష్టాలు ఏమని చెప్పమంటారు సారు..! అప్పులు చేసి లక్షల రూపాయలు మట్టిలో పోశాం.. రేయింబవళ్లు కష్టపడి పండించిన ఉల్లి పంట అమ్ముదామని మార్కెట్‌కు వస్తే కొనేనాథుడే లేడు. రెండురోజుల నుంచి మార్కెట్లోనే ఉన్నాం.. అన్నం తిందామంటే పోవట్లేదు.. ఖర్చులకు కూడా జేబులో చిల్లిగవ్వలేదు. ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసి కొంత ఊపిరి పోసినా.. ఆ డబ్బు ఎప్పుడు వస్తుందో తెలవదు. రవాణా, హమాలీ ఖర్చులు మేమే పెట్టాలి.. రైతుగా పుట్టడం మేము చేసుకున్న పాపమా..? ఓ బస్తా ఉల్లిగడ్డలు తీసుకొని ఓ పూట అన్నం పెట్టమన్నా పెట్టేవాళ్లు లేరు.. అప్పుల పాలయ్యాం. భార్య, బిడ్డలను తలుచుకుంటే కన్నీళ్లు ఉబికిఉబికి వస్తున్నాయి..! సి.బెళగల్ మండలం తిమ్మందొడ్డికి చెందిన కౌలు రైతు వెంకటేశ్వర్లు కన్నీటి వేదన ఇది. ఒక్క వెంకటేశ్వర్లుదే కాదు సగటు ఉల్లి రైతు గుండెకోత ఇది. కర్నూలు మార్కెట్‌లో ఉల్లి రైతులను ఎవరిని కదిపినా కన్నీటి సుడులే. బుధవారం రాత్రి 'ఆంధ్రజ్యోతి' మార్కెట్‌యార్డుకు వెళ్ల క్షేత్రస్థాయి పరిశీలనలో కష్టజీవుల కన్నీటి కష్టాలు ఒక్కొక్కటిగా బయటకొచ్చాయి.

- రోజుల తరబడి మార్కెట్‌లోనే ఉల్లి
- అమ్ముకోలేకపోతున్న అన్నదాత
- కనీస ఖర్చులు కూడా రాని దైన్యం

కర్నూలు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యధికంగా ఉల్లి సాగు చేస్తున్నా జిల్లాల్లో కర్నూలు ఒకటి. రాయలసీమ జిల్లాల్లో అతిపెద్ద ఉల్లి మార్కెట్ కూడా కర్నూలే. జిల్లాలో 31 వేల ఎకరాల్లో ఉల్లి సాగు చేశారు. ఎకరాకు 80 క్వింటాళ్లు దిగుబడి వస్తుందని ఉద్యాన శాఖ అధికారులు అంచనా. పంటకోత సమయంలో అదిక వర్షాలకు పంట దెబ్బతినడంతో 45-50 క్వింటాళ్లకు మించి రావడం లేదు. ఈ లెక్కన జిల్లాలో ఒక్కటే 15.50 లక్షల క్వింటాళ్లు (1.55 లక్షల మెట్రిక్ టన్నులు) దిగుబడి వస్తుందని అంచనా. గతేడాది క్వింటా రూ.5 వేల వరకు పలికితే, తాజాగా క్వింటా వంద, రెండొందలు రూపాయలకు కూడా కొనుగోలు చేయడం లేదు. రవాణా ఖర్చులు కూడా రావడం లేదని వివిధ గ్రామాల్లో పలువురు రైతులు పొలాల్లోనే వదిలేస్తున్నారు. అయితే ప్రభుత్వం ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధర రూ.1,200లకు కొనుగోలు చేస్తుండడంతో కూలీ, రవాణా ఖర్చులైనా వస్తాయని మార్కెట్‌కు తెస్తున్నారు. బుధవారం 14,896 క్వింటాళ్లు ఉల్లి మార్కెట్‌కు వచ్చింది. ఏపీ మార్క్‌ఫెడ్ 6,431 క్వింటాళ్లు కొనుగోలు చేస్తే, వ్యాపారులు 8,465 క్వింటాళ్లు కొనుగోలు చేశారు. రాత్రి 10.30-11 గంటల వరకు తూకాలు, రవాణా కొనసాగింది. పంట తూకాలు వేసే వరకు రైతులు బస్తాలపైనే కూర్చోక తప్పలేదు. బయటకు వెళితే బస్తాలు మాయం చేస్తారని భయం వెంటాడుతుంది.

మిగతా 7వ పేజీలో

సంపూర్ణ పోషణతోనే ఆరోగ్య రక్షణ

- ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ బి.నవ్య
- 'రాష్ట్రీయ పోషణ్' మాసోత్సవాలు ప్రారంభం



చిన్నారుల అన్నప్రాశనలో పాల్గొన్న ఇన్‌చార్జి కలెక్టర్ నవ్య

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ పోషణతోనే ఆరోగ్యానికి రక్షణ అని ఇన్‌చార్జి కలెక్టర్ డా.బి.నవ్య అన్నారు. కర్నూలులోని ఏ.క్యాంపు అర్బన్ హెల్త్ సెంటర్ సమీపంలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నవ్య మాట్లాడుతూ కుటుంబ సభ్యులందరూ ఒకేసారి భోజనం చేయాలన్నారు. చాలా మంది మహిళలు కుటుంబ సభ్యులు భోజనం చేసిన తర్వాతనే భోజనం చేస్తారని, ఇది సరైంది కాదన్నారు. మహిళలు ఆరోగ్యం మెరుగ్గా ఉండాలంటే కుటుంబ సభ్యులందరూ ఒకేసారి భోజనం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.విజయ మాట్లాడుతూ జిల్లాలోని 1,886 అంగన్‌వాడీ కేంద్రాలు, 9 ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో 75సెక్టార్లలో ఈ కార్యక్రమాలు అక్టోబరు 16వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. గర్భిణులకు సీమంతం, చిన్న పిల్లలకు అన్నప్రాశన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కర్నూలు అర్బన్ సీడీపీవో జి.అనురాధమ్మ, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ రాజేశ్వరి, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ కే.బాలు, సూపర్‌వైజర్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టమోటా ధర పతనం

- కిలో రూ.5కు పడిపోయిన వైనం



టమోటాలు ఆటోలో తెచ్చి విక్రయిస్తున్న రైతు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నిన్న మొన్నటి వరకు ఆకాశాన్నంటిన టమోటా ధరలు అంతలోని అధః పాతాళానికి చేరుకున్నాయి. ఈఏడాది టమోటా దిగుబడి బాగుందనుకున్న అన్నదాతలకు, ధరలు అమాంతం పడిపోవడంతో ఇబ్బందులు తప్పలేదు. ఎన్నో వ్యయప్రయాసలతో పండించిన పంటలకు మార్కెట్లో సరైన గిట్టుబాటు ధరలు లేకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సీజన్ ప్రారంభంలో రైతులకు కాస్త గిట్టుబాటు ధర పలకడంతో ఊపిరి పీల్చుకున్నారు. జూలై, ఆగస్టు మాసాల్లో 15కిలోల బాక్స్ ధర రూ.400 నుంచి రూ.450 దాకా పలికింది. కిలో రూ.40 నుంచి రూ.50వరకు అమ్ముడయ్యాయి. అన్నదాతలకు ఆనందం కలిగించింది. కొద్ది రోజుల నుంచి కిలో రూ.5కూడా అమ్ముడు కావడం లేదని వాపోతున్నారు. ఎకరాకు రూ.60వేలకు పైగా పెట్టుబడి పెట్టి పండించిన టమోటా రైతుల పాలిట శాపంగా మారింది. మార్కెట్‌కు తరలిస్తే రవాణా ఖర్చులు కూడా దక్కడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి వ్యవసాయ మార్కెట్‌లో ఉల్లి కొనుగోలు



ఉల్లి కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం నుంచి ఉల్లి కొనుగోలు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది ఉల్లి భారీగా దిగుబడులు రావటంతో కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో కొన్నిరోజులుగా రైతులు ఉల్లిని పెద్దఎత్తున తరలిస్తున్నారు. ప్రభుత్వం ఉల్లికి రూ.1200 మద్దతు ధర ప్రకటించింది. అలాగే ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌లో ఉల్లి కొనుగోలు చేసేందుకు కేంద్రం ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్, ఆదోని సబ్‌కలెక్టర్, మార్కెటింగ్ శాఖ జేడీ, మార్క్‌ఫెడ్ డీఎం ఆదేశించటంతో మార్కెట్‌లో స్థానిక అధికారులు ఏర్పాటు చేశారు. మార్కెట్ వెనుక ఉన్న కూరగాయల హోల్ సేల్ అమ్మకాలు జరిగే ప్రాంతంలోనే మూడు షెడ్లు కేటాయించారు. బుధవారం జంబో షెడ్‌లో రైతులు తెచ్చిన ఉల్లిని పెట్టేందుకు ఎక్స్‌కవేటర్‌తో శుభ్రం చేశారు.

ఉపాధ్యాయుల విజయవాడ బాట



సీఎం చంద్రబాబునాయుడు చెప్పిన విధంగానే మెగా డీఎస్సీపై మొదటి సంతకం చేసి నిరుద్యోగుల కలలను సాకారం చేశారు. 2025 ఏప్రిల్‌లో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేశారు. జూన్ 6 నుంచి జూలై 2వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించారు. సెప్టెంబరు 15న తుది జాబితా విడుదల చేశారు. ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు సీఎం చేతుల మీదుగా రేపు విజయవాడలో మధ్యాహ్నం 2గం టలకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేయ నున్నారు. విజయవాడకు వెళ్లేందుకు ప్రభుత్వమే 134 ఆర్టీసీ బస్సులను ఉమ్మడి జిల్లాలకు కేటాయించారు. ఈ బస్సుల ద్వారా అభ్యర్థులు విజయవాడకు చేరుకుంటారు.


- రేపు ఉద్యోగ నియామక పత్రాలు అందజేత
- కర్నూలు నుంచి 134 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు
- ఉమ్మడి జిల్లాల అభ్యర్థులకు 1నుంచి 124 నెంబరు గలవి..
- నాల్ లోకల్ వారికి 125 నుంచి 133 నెంబరు వరకు..

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏడాదిలోనే డీఎస్సీని నిర్వహించి తక్కువ కాలంలోనే ఫలితాలు ప్రకటించారు. మెగా డీఎస్సీ ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 19న విజయవాడలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలను అందజేయనున్నారు. రాష్ట్రంలోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,678 ఉపాధ్యాయ పోస్టులు మంజూరయ్యాయి. ఇందులో అన్ని కేటగిరీల్లో కలుపుకుని 2590 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారు. మరో 88 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లేకపోవడంతో ఉమ్మడి జిల్లాలో 88 ఉపాధ్యాయ పోస్టులు మిగిలిపోయాయి. వచ్చే ఏడాది నిర్వహించే డీఎస్సీలో మిగిలిపోయిన ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ జిల్లా పరిషత్ యాజమాన్యం విభాగంలో అన్ని కేటగిరిలో 2,547 పోస్టులకు గానూ 2483 పోస్టులు భర్తీ కాగా, 64 పోస్టులు మిగిలిపోయాయి. అలాగే మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యం విభాగంలో 58 పోస్టులకు గానూ 51 భర్తీ కాగా, 7 పోస్టులు మిగిలాయి. మున్సిపల్ యాజమాన్యం విభాగంలో 40 పోస్టులకు గానూ 28 పోస్టులు భర్తీ కాగా, 12 పోస్టులు, ట్రైబల్ యాజమాన్యం విభాగంలో 33 పోస్టులకు గానూ 28 భర్తీ కాగా, 5 పోస్టులు అర్హత గల అభ్యర్థులు లేకపోవడంతో మిగిలిపోయాయి.

మిగతా 6వ పేజీలో

దీపావళికి అన్నదాత సుఖీభవ!

- రెండో విడత నిధుల విడుదలకు కసరత్తు
- నివేదికలు తయారు చేస్తున్న అధికారులు



కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు రెండో విడత పెట్టుబడి సాయాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాయి. రైతులకు పెట్టుబడి సాయం అందించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం కింద రెండో విడత నిధుల కోసం ఎదురు చూస్తున్న వారికి శుభవార్త. పీఎం కిసాన్ పథకంతో కలిపి రైతులకు ఏటా రూ.20వేలు అందించే హామీలో భాగంగా తొలి విడత రూ.7వేల ఆర్థిక సాయాన్ని (పీఎం కిసాన్ మొత్తంతో కలిపి) ఆగస్టు 2న సీఎం చంద్రబాబు విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు రెండో విడత డబ్బులు కూడా రైతుల ఖాతాలో జమ చేయడానికి ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. దీపావళి పండుగ వేళ రైతులకు ఆర్థిక సాయం అందించాలనే ఉద్దేశంతో అక్టోబరు 18న ఈ నిధులు విడుదల చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించినట్లు వ్యవసాయ శాఖ అధికార వర్గాల సమాచారం. రెండో విడతలో భాగంగా కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద రూ.2వేలు, రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద రూ.5వేలు విడుదల కానున్నాయి. ఈ మొత్తాలు కలిపి మొత్తం రూ.7వేలు రైతుల ఖాతాలో జమ కానున్నాయి. రెండో విడత అక్టోబరులో, మూడో విడత జనవరిలో విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని జేడీ వరలక్ష్మి తెలిపారు. అదేవిధంగా ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 60వేల మంది కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ధి చేకూరనుంది.

వన్యప్రాణులను సంరక్షించుకుందాం

- అటవీ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు
- దేశంలోనే ఎన్ఎస్‌టీఆర్ ఫారెస్ట్ అతిపెద్ద సర్కిల్
- అటవీ సంరక్షణాధికారి విజయకుమార్



మాట్లాడుతున్న సీఎఫ్ విజయ్‌కుమార్

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులను సంరక్షించు కుందామని అటవీ సంరక్షణాధికారి విజయకుమార్ పేర్కొన్నారు. బుధవారం నంద్యాల కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ కార్యాలయంలో అటవీ సంరక్షణాధికారి, టైగర్ సర్కిల్ ప్రాజెక్టు ఫీల్డ్‌డైరెక్టర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు ఈసందర్భంగా విజయకుమార్‌కు అటవీ శాఖ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. అటవీ నేరాలు, వన్యప్రాణాల వేట ఎలాంటి పరిస్థితుల్లో క్షమించమని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో తాను ఆత్మకూరు డీఎఫ్‌వో పనిచేసిన అనుభవం ఉందన్నారు. దేశంలోనే నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్(ఎన్ఎస్‌టీఆర్)ఫారెస్ట్ అతి పెద్ద సర్కిల్ అన్నారు. పులుల కదలికలు ఉంటేనే నల్లమల అటవీ ప్రాంతం మరింత పెరిగే అవకాశం ఉంటుం దన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు, ప్రాణవాయువును పెంచుకునే అవకాశం ఉందన్నారు. ఇతర టైగర్ సర్కిల్స్‌లో వాడుతున్న అడ్వాన్స్ టెక్నాలజీని ఎప్పటికప్పుడు తెలుసుకుని అటవీసంరక్షణ, వన్యప్రాణుల సంరక్షణకు మరింత మెరుగైన పద్ధతులతో ముందుకెళతామన్నారు. జంతువులకు హాని కలగకుండా, ట్రైబల్స్ హక్కులకు భంగం కలిగించకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో నంద్యాల ఫారెస్ట్ డీడీ అనురాగ్‌మీనా, ఆత్మకూరు, మార్కాపురం డీడీ అబ్దుల్‌రావూఫ్, గిద్దలూరు డీడీ నిషాకుమారి, శ్రీశైలం సబ్ డీఎఫ్‌వో బబిత కుమారి, నంద్యాల, బండిఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షేక్ నజీర్‌జా తదితరులు పాల్గొన్నారు.

పతనమైన పత్తి ధర

- క్వింటా గరిష్ఠంగా రూ.7,659



విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం పత్తి ధరలు భారీగా పతనమయ్యాయి. ఒక్క రోజులోనే క్వింటాకు రూ.300 పైగా ధర తగ్గడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగయిన పత్తి చేతికి రావడంతో మొదటి కోత పత్తిని విక్రయానికి తీసుకొచ్చారు. వాతావరణ పరిస్థితుల వల్ల రైతులు తేమతోనే పత్తిని విక్రయానికి తీసుకురావడంతో ధర తగ్గిందని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఆరంభంలోనే ధర పతనం కావడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా బుధవారం మార్కెట్‌కు 3,809 క్వింటాళ్ల పత్తి విక్రయానికి తీసుకురాగా వాటి కనిష్ఠ ధర రూ. 4,029, గరిష్ఠంగా రూ.7,659, సగటున రూ.7,481 పలికింది.

శ్రీగిరిపై 22 నుంచి దసరా మహోత్సవాలు

- ఏర్పాట్లు పూర్తి చేస్తున్న అధికారులు



శ్రీశైలం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో దసరా ఉత్సవాలకు సమయం ఆసన్నమైంది. ఈనెల 22వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు శరన్నవరాత్రి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలను ఆలయ ఈఓ శ్రీనివాసరావు వెల్లడించారు. అశ్వయుజ శుద్ధ పాడ్యమి సోమవారం ఉదయం 9 గంటలకు శాస్త్రోక్తంగా యాగశాల ప్రవేశంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. శరన్నవరాత్రుల్లో శ్రీశైల మల్లన్నను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 22న శైలపుత్రి అలంకరణలో అమ్మవారు దర్శనమివ్వగా స్వామివారు భృంగి వాహనంపై విహరిస్తున్నారు. అదేవిధంగా 23న బ్రహ్మచారిణి అలంకారం, మయూర వాహన సేవ, 24న చంద్రఘట అలంకరణ, రావణవాహన సేవ, 25న కూష్మాండదుర్గ అలంకరణ, కైలాస వాహన సేవ 26న స్కందమాత అలంకారం, శేషవాహనసేవ, 27న కాత్యాయని అలంకరణ, హంసవాహనసేవ, 28న కాళరాత్రి అలంకరణ, గజవాహనసేవ ఉంటుంది. అదేవిధంగా 29వ తేదీ అమ్మవారు మహాగౌరిగా భక్తులకు దర్శనమిస్తారు. అదేరోజు స్వామివారికి నందివాహన సేవ ఉంటుంది. 30న సిద్ధిదాయిని అలంకారం, కైలాస వాహన సేవ, అక్టోబరు ఒకటో తేదీన రమావాణి సేవిత రాజరాజేశ్వరి అలంకారం, అశ్వవాహనసేవ, 2వ తేదీన దసరా వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు. దసరా రోజున అమ్మవారం భ్రమరాంబికాదేవిగా భక్తులకు దర్శనమిస్తారు.. అదే రోజు ఆది దంపతులకు నందివాహన సేవ ఉంటుంది. తర్వాత ఉదయం పూర్ణాహుతి, సాయంత్రం శమీ పూజ, రాత్రికి తెప్పోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

సీజీఎంగా ఉమాపతికి పదోన్నతి



ఎం.ఉమాపతి

కల్లూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కర్నూలు విద్యుత్‌శాఖ ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈగా పనిచేస్తున్న ఎం.ఉమాపతి పదోన్నతి పొందారు. ఈమేరకు ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కే. సంతోషరావు బుధవారం ఎం.ఉమాపతికి కార్పొరేట్ ఆఫీస్ తిరుపతిలో చీఫ్ జనరల్‌మేనేజర్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు ఉమాపతికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రదీప్‌కుమార్‌కు ఎస్ఈగా పదోన్నతి

కర్నూలు జిల్లా విద్యుత్ శాఖలో డీఈ డీపీటీగా పనిచేస్తున్న ఆర్.ప్రదీప్‌కుమార్ ఎస్ఈగా పదోన్నతి పొందారు. ఈమేరకు ఏపీఎస్పీడీపీఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కే.సంతోషరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏ జిల్లాకు ఎస్ఈ అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. ఎస్ఈగా పదోన్నతి పొందిన ఆర్.ప్రదీప్‌కుమార్‌ను ఆశాఖ అధికారులు, సిబ్బంది అభినందించారు.

స్వామిత్వ వేగవంతం

గ్రామాల్లో మెరుగైన సాంకేతికతతో కూడిన సర్వే మ్యాపింగ్ కోసం ఏర్పాటు చేసిన పథకం స్వామిత్వ. గ్రామ కంఠం సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం 2020లో స్వామిత్వ సర్వేకు శ్రీకారం చుట్టింది. 2024 ఎన్నికలకు ముందు జిల్లాలో తొలివిడతలో 42 గ్రామాల్లో వివరాలు సేకరించింది. రెండో విడతలో 188 పంచాయతీల్లో సర్వే నిర్వహిస్తున్నారు. మొదటి విడతలో చేపట్టిన సర్వే చాలా వరకు తప్పుల తడకగా సాగింది. వీటి దిద్దుబాటుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం గ్రామాల్లో స్వామిత్వ సర్వే వేగంగా సాగుతోంది.

- గ్రామ కంఠం భూములకు హక్కులు
- రాజముద్రతో హక్కు పత్రం ఇచ్చేందుకు సిద్ధం
- ప్రభుత్వ నిర్ణయంపై ప్రజల్లో హర్షం



కేపీ తాండలో స్వామిత్వ సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

చాగలమర్రి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్వామిత్వ సర్వే వేగంగా సాగుతోంది. భూవివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చొరవ చూపుతోంది. జిల్లాలో 50 శాతం నివాసాలకు యజమానుల వద్ద ఆస్తి పత్రాలు లేవు. దీంతో క్రయ, విక్రయాలకు అవకాశం లేకుండా పోయింది. గ్రామ ఖంతం భూములకు కొనుగోలు చేసిన వాటిలో నిర్మాణాలు చేపడితే బ్యాంకు రుణాలు కూడా మంజూరు చేయడం లేదు. దీంతో గ్రామ కంఠంలోఉన్న ఇళ్లకు ఆస్తి హక్కు లేకపోవడంతో యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వం గ్రామ కంఠంలో ఉన్న ఇళ్లకు హక్కు పత్రాలు ఇచ్చేందుకు స్వామిత్వ సర్వే చేపట్టింది. జిల్లాలో ఇప్పటికే గ్రామాల్లో 80 శాతం సర్వే పూర్తయినట్లు పంచాయతీ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో 28 మండలాల్లో..

నంద్యాల జిల్లాలో 28 మండలాల్లో 489 పంచాయతీలు, రెవెన్యూ పరిధిలో 422 గ్రామాలున్నాయి. ఆయా గ్రామాల్లో 3.20 లక్షల ఇళ్లు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. గ్రామాల్లో గ్రామ కంఠం సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం 2021లో స్వామిత్వ సర్వేకు శ్రీకారం చుట్టింది. 2024 ఎన్నికలకు ముందు జిల్లాలో తొలివిడతలో 42 గ్రామాల్లో వివరాలు సేకరించింది. రెండో విడతలో 188 పంచాయతీల్లో సర్వే నిర్వహిస్తున్నారు. గతంలో మొదటి విడతలో చేపట్టిన స్వామిత్వ సర్వే చాలా వరకు తప్పుల తడకగా సాగింది. వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలపై మాజీ సీఎం జగన్‌బొమ్మను ముద్రించారు. వీటి దిద్దుబాటుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వ రాజముద్రతో పత్రాలు ఇచ్చేందుకు సర్వే సాగుతోంది.



గొట్లూరు గ్రామంలో ఇంటి కొలతలు వేస్తున్న ఇంజనీరింగ్ సహాయకులు

వారసుల పేర్లపై బదలాయింపు జరగక..

గ్రామకంఠం భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. వారసుల పేర్లపై బదలాయింపు జరగడం లేదు. ఈ నేపథ్యంలో స్వామిత్వ ద్వారా ముందుగా రెవెన్యూ ఆయా గ్రామాల హద్దులు గుర్తిస్తున్నారు. అనంతరం చెరువులు, పాఠశాలలు, రహదారులు, దేవాలయాలు, అంగ్‌వాడీ, ఆరోగ్య కేంద్రాలను నమోదు చేస్తున్నారు. ఆ తరువాత ప్రజలు కట్టుకున్న గృహాలకు డ్రోన్ ద్వారా ఫొటోలు తీసి హద్దులను నిర్ధయిస్తున్నారు. పంచాయతీ సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి ఇంటి యజమాని పేరు, ఇంటి నంబర్, ఎప్పుడు నిర్మించుకున్నారు. తదితర వివరాలు సేకరిస్తున్నారు.

విక్రయానికి అవకాశం

సర్వే అనంతరం ఇంటి యజమానికి ఆస్తి హక్కు కార్డులు అందజేస్తారు. ప్రతి కార్డుకు పీపీఎన్ (ప్రాపర్టీ పార్శిల్ నంబర్) కేటాయిస్తారు. ప్రత్యేక క్యూఆర్‌కోడ్ ఉంటుంది. ఇందులో యజమాని పూర్తి వివరాలు ఉంటాయి. వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఇంటర్‌నెట్‌లో వివరాలు ఎప్పుడైనా చూసుకోవచ్చు. కుటుంబ అవసరాల కోసం విక్రయించుకోవచ్చు. బ్యాంకుల నుంచి రుణాలు పొందొచ్చు.

తప్పులు లేకుండా హక్కు పత్రాలు

స్వామిత్వ సర్వేలో గ్రామ కంఠంలో ఉన్న ఇళ్లకు యాజమాన్యపు హక్కులు కల్పించి హక్కు పత్రాలు తప్పులు లేకుండా జారీ చేస్తారు. ఈ మేరకు సచివాలయ ఉద్యోగులు సర్వేను వేగవంతం చేస్తున్నారు. ఈ సర్వేను దీపావళికి పూర్తి చేసి హక్కు పత్రాలను రాజముద్రతో ఇచ్చేందుకు సిద్ధం చేస్తున్నారు.

స్వామిత్వ సర్వే వేగవంతం

జిల్లాలోని 28 మండలాల్లో గల 188 గ్రామ పంచాయతీల్లో రెండో విడత స్వామిత్వ సర్వే వేగవంతం చేస్తున్నాం. హక్కుల పత్రాల్లో ఎలాంటి తప్పుల్లేకుండా జారీచేస్తాం. ఈమేరకు పంచాయతీ సిబ్బందికి డిప్యూటీ ఎంపీడీవో ద్వారా ఆదేశాలిచ్చాం. 90 శాతం దాకా సర్వే జరుగుతోంది. అక్టోబరు చివరినాటికి సర్వే పూర్తిచేయాలన్న లక్ష్యం ఉంది.

- లలితాబాయి, డీపీవో, నంద్యాల



స్వామిత్వ సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

ఆరోగ్య భద్రతే లక్ష్యం

- 'స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్' షురూ
- అన్ని ఆసుపత్రుల్లో మహిళలకు వైద్య పరీక్షలు



ఆలూరు మండలం మొలగవల్లి పీహెచ్‌సీలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆలూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయి. బుధవారం నుంచి స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ (ఆరోగ్యవంతమైన మహిళ శక్తిమంతమైన కుటుంబం) కార్యక్రమం ప్రారంభమైంది. 15 రోజులపాటు వివిధ కార్యక్రమాల నిర్వహణకు వైద్య, ఆరోగ్యశాఖ శ్రీకారం చుట్టింది. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక కారణాలతో ఆసుపత్రికి వెళ్లలేని స్థితిలో ఉండే వారికి అండగా నిలిచి వారికి వైద్యసాయం అందించమే ఈఅభియాన్ లక్ష్యం. జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని ఆరోగ్య ఉపకేంద్రాలు, పీహెచ్ సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల్లో ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఆలూరు మండలం మొలగవల్లి, ఆలూరు, కమ్మరచేడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

అందించే సేవలు..

మహిళలు, కిశోర బాలికలకు స్ర్కీనింగ్, రక్తపోటు, మధుమేహం, గర్భాశయ, రొమ్ము, నోటి క్యాన్సర్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తిస్తారు. గర్భిణులను పరీక్షించి వారికి అవసరమైన పోషకాహార ఆవశ్యకతను వివరిస్తారు. ఎంసీపీ కార్డులు అందిస్తారు. చిన్నారుల్లో సికిల్ సెల్ అనీమియాను గుర్తించి చికిత్స చేస్తారు. క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు, చిన్నారులు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తారు. మానసిక వైద్యసేవలు, ఆయుష్‌సేవలు, వయోవృద్ధుల ఆరోగ్య పరీక్షలు, పోషణ్ అభియాన్, ఈట్ రైట్, తల్లీబిడ్డ సేవలు, రక్తదాన శిబిరాల నిర్వహణ, ఆయుష్మాన్ వయో వందన ఆరోగ్య కార్డుల పంపిణీ, పరిశుభ్రత, పోషకాహారానికి సంబంధించి సమాచారం, కౌన్సెలింగ్ ఇస్తారు. ప్రధానమంత్రి మాతృ వందన యోజనలో ప్రత్యేక నమోదు చేస్తారు. సికిల్ సెల్ కార్డు, ఐడీ రిజిస్ట్రేషన్ చేస్తారు. మహిళలకు వచ్చే నెల 2వరకు ఈ వైద్య పరక్షలు నిర్వహిస్తారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మొలగవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు మల్లేశ్వరి కోరారు.

ఎన్ఎంఎంఎస్ దరఖాస్తుకు వేళాయె..!

- 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు స్కాలర్‌షిప్
- ఈనెల 30వ తేదీ వరకు గడువు
- డిసెంబర్ 7న రాతపరీక్ష



ఆలూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన పేద విద్యార్థుల చదువులు కొనసాగించేలా కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనం అందిస్తూ చేయూతనిస్తోంది. ఏటా నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష నిర్వహిస్తోంది. దరఖాస్తుకు ఈనెల 4వ తేదీ నుంచి 30వ తేదీ వరకు గడువు విధించారు. పరీక్ష డిసెంబర్ 7వ తేదీన నిర్వహిస్తారు. ప్రభుత్వ బడుల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులు. ఇందులో అర్హత సాధిస్తే 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు నాలుగేళ్ల పాటు యేటా రూ.12వేలు చొప్పున స్కాలర్‌షిప్ అందుతుంది.

అర్హులు వీరే..: ప్రస్తుతం 2025-26 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. ఓసీ, బీసీలైతే 55 శాతం, ఎస్సీ, ఎస్టీలు అయితే 50శాతం మార్కులు లేదా దానికి సమానమైన గ్రేడ్ సాధించిన వారు అర్హులు.

- విద్యార్థి కుటుంబ ఆర్థిక ఆదాయం రూ.3.50 లక్షలకు మించరాదు. ప్రభుత్వ ఎయిడెడ్, స్థానిక సంస్థల పాఠశాలల్లో రెగ్యులర్‌గా చదువుతున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, సైనిక్ పాఠశాలలు, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకుల విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అవకాశం ఉంది.

విద్యార్థులు డబ్ల్యూ డబ్ల్యూడబ్ల్యూ.బీఎ స్ఈ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

పేద విద్యార్థులకు చక్కటి అవకాశం

కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎన్ఎంఎంఎస్ పరీక్ష పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకు సాయంగా ఉంటుంది. విద్యార్థులు బాగా చదువుకుని పరీక్షలో ప్రతిభ చూపితే నాలుగేళ్లపాటు ఆర్థిక వెసులుబాటు ఉంటుంది.

-శామ్యూల్‌పాల్, డీఈవో, కర్నూలు

హిట్ అండ్ రన్ కేసులపై సమీక్ష



సమావేశం నిర్వహిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో జరిగిన హిట్ అండ్ రన్ కేసులపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి బుధవారం సమీక్ష నిర్వహించారు. కర్నూలులోని న్యాయ సేవాసదన్‌లో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిట్ అండ్ రన్ కేసులతో బాధితులు నష్టపోకుండా వారికి తగిన రీతిలో ఆర్థిక సాయం పొందేందుకు అధికారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 76 హిట్ అండ్ రన్ కేసులకు 21 కేసుల్లో నష్టపరిహారాన్ని చెల్లించేందుకు సఫలీకృతమైనట్లు అధికారులు తెలిపారు. నంద్యాల జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 37 హిట్ అండ్ కేసులలో 11 కేసులలో నష్టపరిహారం మంజూరైనట్లు అధికారులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. మిగతా హిట్ అండ్ రన్ కేసులను కూడా త్వరితగతిన పరిష్కారమై బాధితులకు నష్టపరిహారం త్వరగా అందేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల డీఆర్వోలు వెంకటనారాయణమ్మ, రాము నాయక్, నంద్యాల డీటీవో శివారెడ్డి, కర్నూలు రీజనల్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ భరత్ చవాన్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరాం పాల్గొన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల



4 గేట్లతో కొనసాగుతున్న నీటి విడుదల

శ్రీశైలం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం కుడి, ఎడమ రెండు విద్యుత్ కేంద్రాల్లో గడిచిన 24 గంటల్లో 32.477 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి జెన్‌కో అధికారులు గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. జలాశయానికి వరద ప్రవాహం పెరగడంతో జలవనరులశాఖ ఇంజనీర్లు డ్యాం నాలుగు రేడియల్ క్రస్ట్ గేట్లను ఒక్కొక్కటి 10 అడుగుల ఎత్తు మేరకు తెరిచి దిగువ సాగర్‌కు 1,11,016 క్యూసెక్కులు దిగువ సాగర్‌కు విడుదల చేశారు. బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి డ్యాం నీటిమట్టం 884 అడుగులుగా ఉండగా.. నీటినిల్వ సామర్థ్యం 211 టీఎంసీలుగా నమోదగా అయింది. ఎగువ జూరాల స్పిల్‌వే, విద్యుదుత్పత్తి, సుంకేసుల, హంద్రీ నుంచి 2,07,338 క్యూసెక్కులు శ్రీశైలం రిజర్వాయర్‌కు వచ్చి చేరాయి. శ్రీశైలం రెండు జలవిద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి అనంతరం జెన్‌కో అధికారులు 66,060 క్యూసెక్కులు విడుదల చేశారు.

ఉపాధ్యాయుల విజయవాడ బాట

(5వ పేజీ తరువాయి)

డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ నెల 19న విజయవాడలో మధ్యాహ్నం 2గంటలకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేయ నున్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విదంగా ఒక వేడుకలా నిర్వహించేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో అన్నీ ఏర్పాట్లుచేస్తున్నారు. కర్నూలు ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులు ధ్రువపత్రాలు పరిశీలన చేసుకున్న రాయల సీమ విశ్వవిద్యాలయంలో గురువారం ఉదయం 8 గంటల్లోపు అభ్యర్థులు చేరుకోవాల్సి ఉంది. ప్రభుత్వమే ఏర్పాటుచేసిన ఆర్టీసీ బస్సులు 134 ఉమ్మడి జిల్లాలకు కేటాయిం చారు. ఈ బస్సుల ద్వారా అభ్యర్థులు విజయవాడకు చేరుకుంటారు.

అన్ని ఏర్పాట్లు చేశాం: ఇన్‌చార్జి కలెక్టర్ నవ్య

కర్నూలు కలెక్టరేట్: రేపు విజయవాడకు బయలుదేరే డీఎస్సీ ఉపాధ్యాయుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఇన్‌చార్జి కలెక్టర్ నవ్య తెలిపారు. బుధవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు. కర్నూలు జిల్లా తరుపున చేసిన ఏర్పాట్లపై ఇన్‌చార్జి కలెక్టర్ డా.బి.నవ్య రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. గురువారం ఉదయం ఉపాధ్యాయులు అల్పాహారం అనంతరం ఉదయం బయలు దేరుతారని, వారికి మార్గమధ్యలో భోజనం ఏర్పాటు చేశామన్నారు. రాత్రికి గుంటూ రులో బస ఉంటుందని తెలిపారు.

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో..

అభ్యర్థులందరిని కోఆర్డినేషన్ చేసేందుకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంఈవోలను, ఉప విద్యాశాఖ అధికారులను లైజన్స్ ఆఫీసర్లుగానూ, నోడల్ ఆఫీసర్‌గా నియమిం చింది. ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల వారీగా అభ్యర్థులకు బస్సులను ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి అభ్యర్థులకు అల్పాహారం నుంచి మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనాలు స్నాక్స్‌ను స్వీకరించి తిరిగి కర్నూలు చేరే వరకు ఏర్పాటు చేసింది. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నిసౌకర్యాలు ఏర్పాటుచేసినట్లు కర్నూలు డీఈవో అధికారి శామ్యూల్‌పాల్ పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సు నంబర్ 1 నుంచి 124 వరకు ఉమ్మడి జిల్లాల అభ్యర్థులకు, 125 నుంచి 133 నెంబరు వరకు గల బస్సులను నాన్ లోకల్ కేటగిరి అభ్యర్థులకు కేటాయించినట్లు ఆయన తెలిపారు.

ఉల్లి.. గొర్రెలను వదిలి..!



ఉల్లి సాగు చేసే రైతులకు కన్నీటి కష్టాలు తప్పడం లేదు. ఇంకా ఆర్థిక భారాన్ని మోయలేక వర్కూరు గ్రామానికి చెందిన రంగముని అనే కౌలు రైతు రెండెకరాల్లో ఉల్లిని బుధవారం గొర్రెలకు వదిలేశాడు. అతడు రూ.15వేలు ప్రకారం దాదాపు ఐదెకరాలు పొలం కౌలుకు తీసుకున్నాడు. ఖరీఫ్‌లో రెండెకరాల చొప్పున ఉల్లి, పత్తి సాగుచేశాడు. మరో ఎకరా వరి పంట వేశాడు. ఉల్లి సాగులో విత్తనాలు, నారు పెంపకం, నాటు, కలుపులు, ఎరువులు, పిచికారీ కోసం సుమారు రూ.1.60లక్షలు ఖర్చు చేశాడు. ఇప్పుడు ఉల్లి పీకడం, కోత, గ్రేడింగ్, మార్కెట్ తరలించడానికి ఎకరాకు మరో రూ.40 వేలు ఖర్చు అవుతుంది. ఎకరా కోత చేయడానికే రూ. 13 వేలు చెల్లించాలి. ఈ తతంగమంతా పూర్తిచేసి మార్కెట్‌కు తరలిస్తే ఎకరాకు రూ.40వేలు కూడా వచ్చే పరిస్థితి లేదు. నష్టం తగ్గించుకోవడానికే ఉల్లి పంటను గొర్రెలకు మేతగా వదిలేశానంటూ రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. ● కోడుమూరు రూరల్, ఆంధ్రజ్యోతి

హైకోర్టు పేరుతో డ్రామాలెందుకు?

● టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేఈ జగదీష్



మాట్లాడుతున్న టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేఈ జగదీశ్

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నాడు మూడు రాజధానులతో.. నేడు హైకోర్టు పేరుతో వైసీపీ డ్రామాలు ఎందుకని టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేఈ జగదీశ్ ప్రశ్నించారు. బుధవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఆకేపోగు ప్రభాకర్, న్యాయవాదులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉంటూ న్యాయ రాజధానిని కర్నూలులో ఏర్పాటు చేస్తామంటూ ప్రగల్భాలు పలికి ఎందుకు ఏర్పాటు చేయలేదో ముందు చెప్పాలన్నారు. హైకోర్టు ఏర్పాటు చేయాలని ప్రశ్నించే అర్హత వైసీపీ న్యాయవాదులకు లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం నిరసన చేస్తున్న న్యాయవాదులు ఆనాడూ జగన్ పాలనలో హైకోర్టు బెంచ్, హైకోర్టు కోసం ఎందుకు ఆందోళనలు, నిరసనలు చేయలేదని ప్రశ్నించారు. జగన్ చెప్పినట్లు బూటకపు ధర్నాలు, నిరసనలు చేస్తే ప్రజలు నమ్మేందుకు సిద్ధంగా లేరన్నారు.

ఏబీసీ క్వార్టర్సు పేరుతో..

నగరంలోని ఏబీసీ క్వార్టర్సులో నివాసం ఉంటున్న అక్రమార్కులు డ్రామాలు ఆపాలని కేఈ జగదీశ్ అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జరుగుతుంటే ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఇలాంటి సంఘటనలు తెరపైకి తెచ్చి మంత్రి టీజీ భరత్‌పై అసత్య ప్రచారాలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. తప్పుడు ప్రచారం చేస్తున్నన వారిపై కూడా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ సమావేశంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ జేమ్స్, సాంస్కృతి విభాగం జిల్లా అధ్యక్షుడు హను మంతరావు చౌదరి, న్యాయవాదులు దాశెట్టి శ్రీనివాసులు, శ్రీనివాస్ భట్, నాగముణీ, సత్రం రామకృష్ణుడు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొనవద్దు

కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



అక్రమ లేఅవుట్‌లను పరిశీలిస్తున్న కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

హొళగుంద, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతి లేకుండా ఏర్పాటుచేసిన అక్రమ లేఅవుట్లలో ఎవరూ ప్లాట్లను కొనవద్దని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌తో కలిసి హొళగుందలోని 13 లేఅవుట్లను గుర్తించారు. అక్రమ లేఅవుట్లపై ఆయన కొరడా ఝుళిపించారు. గతంలో వేసిన నాన్ లేఅవుట్‌లను పరిశీలించి వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని, లేనిపక్షంలో సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడితే కఠిన చర్యలు తప్పవన్నారు. నాన్ లేఅవుట్ వేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు 90 రోజుల్లో పంచాయతీ ద్వారా అనుమతులు తీసుకోవాలని సూచించారు. సోమిశెట్టి వెంకటేశ్వర్లు హొళగుందకు చెందిన ఆర్య వైశ్య సంఘం నాయకులు క్రిష్ణమూర్తి శెట్టి, శివప్రకాష్ శెట్టి శాలువా పూల మాలతో ఘనంగా సన్మానించారు. ఆర్యవైశ్య సంఘం వారికి శ్మశాన వాటికను ఏర్పాటు చేయాలని కోరారు.

ఉబికి వస్తున్న కన్నీళ్లు!


(5వ పేజీ తరువాయి)

ఉల్లి దిగుబడులు ఏపీ మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసినా, ఖాళీ సంచులు, గడ్డలు దింపడం, తూకం వేసే హమాలీ ఖర్చులు సహా చివరికి సంచులు కుట్టేందుకు పురికోసం కూడా రైతులే భరించాలి. పెట్టుబడి, నాలుగు నెలలు భార్యపిల్లల కష్టం కాదని, చేతికొచ్చాక పంట కోతకు కూలీల ఖర్చు ఎకరాకు రూ.20 వేలు వస్తుంది. ఉల్లి మార్కెట్‌కు తీసుకురావాలంటే బస్తాకు రూ.50 రవాణా భరించాలి. పంట గ్రేడింగ్, పొలంలో ట్రాక్టర్‌కు లోడ్ చేసేందుకు బస్తాకు రూ.50కు పైగా వస్తోంది. ఎకరాకు వంద బస్తాలు దిగుబడి వస్తే పంట కోత, గ్రేడింగ్, రవాణా ఖర్చులు కలిపి రూ.30-35 వేలు ఖర్చు వస్తుంది. ఈ ఖర్చులు కాదని మార్కెట్‌కు వచ్చిన ఉల్లి ప్లాట్‌ఫాంలో దింపేందుకు, కాటా వేసేందుకు హమాలీ బస్తాకు రూ.50, ఖాళీ సంచి రూ.9, సంచులు కుట్టేందుకు తాడు కిలో రూ.150 కలిపితే వంద బస్తాలకు రూ.6,050కు పైగా రైతులే భరించాల్సి ఉంటుంది. ఏపీ మార్క్‌ఫెడ్ క్వింటా రూ.1,200కు కొనుగోలు చేస్తుందే తప్పా ఖాళీ సంచులు, హమాలీ ఖర్చులు ఒక్కపైసా భరించదు.

● **రూ.10.94 కోట్లు చెల్లించాలి**

ఏపీ మార్క్‌ఫెడ్ 6,057 మెట్రిక్ టన్నులు (60,570 క్వింటాళ్లు) కొనుగోలు చేసింది. క్వింటా రూ.1,200 ప్రకారం రూ.7.26 కోట్లు రైతులకు చెల్లించాలి. ఇప్పటి వరకు రూ.1.54 కోట్లు మాత్రమే చెల్లించినట్లు అధికారులు తెలిపారు. రూ.5.72 కోట్లు బకాయి ఉంది. వ్యాపారులు కొనుగోలు చేసిన ధరపై వ్యత్యాసం 6,202 టన్నులకు మరో రూ.5.22 కోట్లు కలిపి రూ.10.94 కోట్లు ఉల్లి రైతులకు చెల్లించాల్సి ఉంది. బుధవారం కొనుగోలు చేసిన 14,896 క్వింటాళ్లకు రూ.1.78 కోట్లు కలిపితే రూ.12.72 కోట్లు ఉల్లి డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది.


తాడు కూడా మేమే కొనాలి



ఎకరం పొలంలో ఉల్లి సాగు చేశాను. రూ.లక్ష పెట్టుబడి పెట్టాను. వంద బస్తాలు దిగుబడి వచ్చింది. పొలంలోనే వదిలేద్దామని అనుకున్నాను. ప్రభుత్వం కొంటుందని మార్కెట్‌కు తెచ్చాను. పంట కోత, రవాణా ఖర్చులే రూ.35 వేలు అయ్యాయి. ప్రభుత్వం కొనుగోలు చేసినా హమాలీ ఖర్చులు సహా తాడు కూడా మేమే కొని ఇవ్వాలి. ప్రభుత్వం కొనడం వల్ల కొంత ఊపిరి నిలిపింది. పడేయలేక మార్కెట్‌కు తెచ్చాం. ఉల్లిగడ్డలు చూస్తుంటే కన్నీళ్లు వస్తున్నాయి.

● రాఘవేంద్ర, ఉల్లి రైతు, తిమ్మందొడ్డి, సి.బెళగల్ మండలం


20 ఏళ్లలో ఇలాంటి పరిస్థితి చూడలేదు



మూడు ఎకరాలకు కౌలుకు చేశాను. ఎకరన్నర పొలంలో ఉల్లి వేశాను. రూ.1.50 లక్షలు అప్పు చేసి మట్టిలో పోశాను. అధిక వర్షాలకు పంటదెబ్బతిని 90 బస్తాలే దిగుబడి వచ్చింది. ప్రభుత్వం రూ.1,200కు కొనుగోలు చేసినా వెంటనే డబ్బులు ఇవ్వడం లేదు. హమాలీ ఖర్చులకు కూడా అప్పులు చేయాల్సి వస్తుంది. 20 ఏళ్లుగా ఉల్లి సాగు చేస్తున్నాను. ఇలాంటి పరిస్థితి ఎన్నడు చూడలేదు. ప్రభుత్వం డబ్బులు ఇవ్వకపోతే పురుగుమందే శరణ్యం. పెట్టుబడి, భార్య పిల్లల కష్టం మట్టిపాలైంది.

● వెంకటేశ్వర్లు, కౌలు రైతు, తిమ్మందొడ్డి, సి.బెళగల్ మండలం

● బువ్వ తిందామన్నా పోవట్లేదు



మా కష్టం ఏమని చెప్పేది. రూ.4 లక్షలు ఖర్చు చేసి ఉల్లిసాగు చేస్తే 250 బస్తాలు (125 క్వింటాళ్లు) దిగుబడి వచ్చింది. మంగళవారం మార్కెట్‌కు వచ్చాం. వ్యాపారులు కొనడం లేదు. ప్రభుత్వం కొన్నా అన్ని ఖర్చులు మేమే భరించాలి. అప్పులు, భార్యపిల్లలను తలుచుకుంటే కన్నీళ్లు వస్తున్నాయి. ఉదయం నుంచి అన్నమే తినలేదు. బువ్వ తిందామన్నా పోవట్లేదు.

● రాముడు, ఉల్లి రైతు, గుండ్రేవుల గ్రామం

అసలేమైంది ఈ క్యాంపస్‌కు..



ఆర్‌యూ క్యాంపస్‌లో సమస్యలు తాండవం చేస్తున్నాయి. అధ్యాపకులు, విద్యార్థులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ప్రొఫెసర్లు పట్టించుకోవడం లేదు. లెక్చరర్లు సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేస్తుండగా విద్యార్థులు చెట్లకింద టైంపాస్ చేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు ఆధిపత్య పోరుతో కేవలం పరిపాలన భవనానికే పరిమితం అయ్యారు. ఆర్‌యూ పరిధిలోని వసతిగృహాల్లో సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నారు. మెస్‌లో నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. సెక్యూరిటీ తీరు అధ్వానంగా తయారైంది.

- ఓవైపు సెల్‌ఫోన్లతో అధ్యాపకులు కాలక్షేపం
- మరోవైపు చెట్ల కింద విద్యార్థులు
- ఏడీ బిల్డింగ్‌లో కొందరు ప్రొఫెసర్లు
- సమస్యల వలయంలో హాస్టల్ భవనాలు
- పాలన అస్తవ్యస్తం
- పట్టించుకోని ఉన్నతాధికారులు

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆర్‌యూ(రాయలసీమ యూనివర్సిటీ) క్యాంపస్ పరిస్థితి ఎవరికీ వారే యమునాతీరు అన్న చందంగా తయారైంది. అధ్యాపకులు చాంబర్లలో సెల్‌ఫోన్లలో గేమ్స్ ఆడుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. ప్రొఫెసర్లు అదనపు బాధ్యతలతో పరిపాలనా భవనానికే అంకితమౌతున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. విద్యార్థులకు తరగతి గదుల్లో బోధించే వారు లేక చెట్ల కింద కొందరు, క్యాంపస్‌లో ఆకతాయి మాటలతో టైం పాస్ చేసేందుకు మరి కొందరు విద్యార్థులు పరిమితమవుతున్నారని కొందరు ఉద్యోగులు అంటున్నారు.

అధికారుల ఆధిపత్య పోరుతో..

పర్యవేక్షించాల్సిన అధికారులు ఆధిపత్య పోరుతో కేవలం పరిపాలన భవనానికే పరిమితం అయ్యారు. పేద విద్యార్థుల సంక్షేమం కోసం వనరులు, నిధులు కేటాయిస్తున్నప్పటికి సద్వినియోగం కాకపోవడంతో ఉన్నత విద్యా చదువులు అందక పేద విద్యార్థులు ఎందరో లబోదిబోమంటున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలెన్నో..!



శిథిలావస్థలో వసతి గృహాలు

ఆర్‌యూ పరిధిలోని వసతిగృహాల్లో సమస్యలతో విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. మినరల్ వాటర్ లేకపోవడంతో రోగాల బారిన పడుతున్నారు. వేమన మెస్ హాలు, కృష్ణ బిల్డింగ్ శిథిలావస్థకు చేరుకున్నాయి. తుంగభద్ర భవనంలో మరుగుదొడ్ల సమస్యలు నెలకొంది. న్యూబాయ్స్ హాస్టల్‌లో మొదటి, రెండవ అంతస్తుల్లోకి మోటర్ పంపింగ్ జరగకపోవడంతో నీరులేక ఇంజనీరింగ్ విభాగం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు వారానికి ఒక సారి శుభ్రం చేసే ప్రక్రియను చేపట్టడంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. కింది ఫ్లోర్‌లో పైపుల లీకేజీ నీటితో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్ట్స్ అండ్ సైన్సు విభాగంతో పాటు ఇంజనీరింగ్ కళాశాలకు విద్యార్థులు 470 మంది దాకా ఉంటున్నారు. వీటిలో కొన్ని గదుల్లో ఒక్కో గదికి 6మంది విద్యార్థులను కేటాయించారు. మంచాలు తుప్పుపట్టాయి. మెస్‌లో కూడా శుభ్రం లేకపోవడంతో ఒక్కోసారి భోజనంలో పురుగులు, రాళ్లు వచ్చాయంటూ కొన్నిసార్లు విద్యార్థులు ఘర్షణలకు దిగుతున్నారు. విషయం బయటకు పొక్కకుండా ఓప్రొఫెసర్ కనుసన్నల్లో నిర్వహణ సాగుతోంది.

పుడ్డులో గుడ్డు లేకపాయె..!



అధ్వానంగా మెస్ వంటశాల

మెనూ ప్రకారం మంగళవారం రాత్రి కోడి గుడ్డు అందించలేదు. దీంతో కొందరు విద్యార్థులు బుధవారం పరిపాలన భవనం ఎదుట ఆందోళనకు దిగారు. మెస్‌లో నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు గుడ్డుతో పాటు ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని విద్యార్థులను కోరడంతో కొందరు విద్యార్థులు సమస్యలు రాక ముందే చర్యలు చేపట్టాలని కోరారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇవ్వడంతో విద్యార్థులు వెనుదిరిగారు.

బయటి వ్యక్తులు..

క్రీడా మైదానంలోకి కార్ డ్రైవింగ్ స్కూల్స్‌కు చెందిన కొందరు బయటి వ్యక్తులు కారు డ్రైవింగ్ కోసం వస్తున్నారని విద్యార్థులు చెబుతున్నారు. సరైన వసతులు ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు అసౌకర్యానికి గురౌతూ ప్రైవేటు జిమ్‌లను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడున్న జిమ్ చుట్టూ చెట్లు మొలిచి పరికరాలు తుప్పు పట్టి విద్యార్థులు ఉపయోగం లేకుండా పోయింది.

సెక్యూరిటీ అస్తవ్యస్తం

సెక్యూరిటీ తీరు అధ్వానంగా తయారైంది. తెలంగాణకి చెందిన ఓ ఏజెన్సీ నిర్వాహకుడికి ఇవ్వడంతో పర్యవేక్షణ లేక క్యాంపస్‌లో బయటి వ్యక్తుల సంచారానికి అడ్డుకట్ట వేయలేకపోతున్నారు.



చెట్ల కింద కాలక్షేపం చేస్తున్న విద్యార్థులు

అధ్యాపకుల కొరత వాస్తవమే

కొందరు ప్రొఫెసర్లకు అదనపు బాధ్యతలు ఉండటంతో పరిపాలన భవనానికి పరి మితం అవుతున్నా మాట వాస్తవమే.. ఫలితంగా అధ్యాపకులు తరగతి గదుల్లో బోధిం చేందుకు ఉండటం లేదన్న మాటలో కూడా వాస్తవం లేక పోలేదు. అలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు కూడా ఇబ్బందులు పడుతునట్లు నాదృష్టికి వచ్చింది.

● సీవీ కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్, ఆర్‌యూ



పరిపాలన భవనం ఎదుట కోడి గుడ్డు కోసం నిరసన

కలెక్టర్ గారూ..

దవాఖానాపై దృష్టి పెట్టండి

- స్కానింగ్ టోకెన్ల కోసం పడిగాపులు
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు
- ఇబ్బందులు పడ్డ రోగులు
- 200 మందికి గానూ 84 టోకెన్లు మాత్రమే పంపిణీ

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కొత్తగా వచ్చిన కలెక్టర్ గారూ.. కర్నూలు సర్వజన వైద్యశాలపై దృష్టి పెట్టాలని రోగులు కోరుతున్నారు. ఎంతో ఆశతో మెరుగైన వైద్యం అందుతుందనే రోగులకు కష్టాలు తప్పడం లేదు. నిత్యం పాట్లు పడుతూ వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అధికారులు, రేడియాలజి వైద్యుల నిర్లక్ష్యంతో అల్ట్రాసౌండ్ పరీక్షల కోసం రోగులు పడిగాపులు కాశారు.

గంటల తరబడి..

స్కానింగ్ పరీక్షల టోకెన్ల కోసం బుధవారం మధ్యాహ్నం 12గంటల ఓపీ రోగులు కౌంటర్ వద్దకు వచ్చారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా మూడు గంటలు అక్కడే వేచిఉన్నారు. మధ్యాహ్నం 3గంటల సమయంలో ఓ స్టాఫ్ నర్సు అక్కడికి చేరుకుంది. 200 మందికి పైగా అప్పటికే వేచి ఉండగా వారిలో కేవలం 84 మందికి స్కానింగ్ టోకెన్లు ఇచ్చి చేతులు దులుపుకుంది.

కన్నెత్తి చూడని అధికారులు

200 మందిలో 84 మందికి టోకెన్లు అందగా మిగతా పేద రోగులందరూ ఇంటి బాట పట్టారు. మిగిలినవారు గురువారం రావాలని చెప్పారు. దీంతో రోగులు అక్కడున్న సిబ్బందితో గొడవపడ్డారు. ఈ రచ్చరచ్చగా ఉన్నా కూడా ఇటు రేడియాలజి వైద్యులుగాని, అధికారులు గానీ అటు వైపు కన్నెత్తి కూడా చూడలేదు. దీంతో రోగులు మండిపడుతున్నారు. ఆసుపత్రిలో కొందరు అధికారులు రౌండ్స్ చేయకుండా తమ గదులకు పరిమితమయ్యారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా వచ్చిన కలెక్టర్ న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌లో నెలకొన్న స్కానింగ్ పరీక్షలు పేదవారికి అందేలా చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.





మధ్యాహ్నం 3 గంటల సమయంలో స్కానింగ్ టోకెన్ కోసం గొడవ పడుతున్న రోగులు

కూలి కోసం సమ్మెకు సై

● ఆందోళనలకు సిద్ధమవుతున్న హమాలీలు



ఎమ్మిగనూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో పనిచేస్తున్న హమాలీలకు కూలిరేట్లు పెంపు ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వస్తోంది. వారం రోజుల క్రితం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి మార్కెట్‌లో పర్యటించిన క్రమంలో హమాలీల కూలి పెంపు పంచాయతీ కొలిక్కి వస్తుందనుకున్నప్పటికి అది కాస్తా మరోసారి వాయిదా పడింది. దీంతో హమాలీలు సమ్మెకు సిద్ధమవుతున్నారు. మార్కెట్ కమిటీలో పనిచేసే హమాలీలు, కూలీలు తమకు కనీస కూలి ఇవ్వాలని తరచూ డిమాండ్ చేస్తున్నారు. వాస్తవంగా గతంలో కూలిరేట్ల పెంపుపై చేసుకున్న అగ్రిమెంట్ 10.10.2024న ముగిసింది. దీంతో ఇరువురు సమావేశమై అగ్రిమెంట్ ప్రకారం 25శాతం కూలి పెంపుపై చర్చించి అగ్రిమెంటు చేసుకోవాల్సి ఉంది. అయితే గతంలో పలు మార్లు కమీషన్ ఏజెంట్లు, హమాలీల నడుమ కూలి పెంపుపై చర్చలు విఫలం కావటంతో వాయిదా పడుతూ వచ్చింది. ఈనెల 13న శనివారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి సమక్షంలో ఇరువురు సమావేశం నిర్వహించారు. అయితే మార్కెట్‌లో ప్రస్తుతం మార్కెట్‌లో పనిచేస్తున్న వారితో పాటు కొత్త వారు పనిచేస్తున్నారని వారికి పూర్తిస్థాయిలో కొత్తగా లైసెన్సులు ఇవ్వటం, ఏఏ దుకాణదారుడికి ఎంతమంది హమాలీలు అవసరమో ఆ మేరకు కొత్తవారిని తీసుకుని అటు తరువాత కూలి రేట్లపెంపుపై చర్చిద్దామని ఎమ్మెల్యే తెలిపారు. మార్కెట్‌లో ఎవరంటే వారు వచ్చి అనధికారికంగా పనులు చేస్తున్నారని, దీంతో వారికి ఏమైనా జరిగితే ఎవరిది బాధ్యత అన్నారు. అంతేగాక అనధికారింగా పనిచేసే వారు అక్రమాలకు పాల్పడితే ఎవరు బాధ్యత వహిస్తారని సమావేశంలో ప్రశ్నించారు. ఇందుకు హమాలీలు ససేమీరా అన్నారు. మార్కెట్ నడిచేది అంతంత మాత్రమేనని, ఏడాది పొడవునా మార్కెట్‌కు సరుకురాదని అలాంటప్పుడు కొత్తవారిని తీసుకుంటే ఏమి ప్రయోజనమన్నారు. ఈ విషయంపై చర్చించి చెబితే, కూలి పెంపు ఎంత మేర అన్నది చర్చిద్దామన్నారు. దీంతో సమావేశం అక్టోబరు 6వ తేదీకి వాయిదా వేశారు. కూలి పెంపు వాయిదా పడటంతో హమాలీలు తీవ్ర అసహనానికి లోనయ్యారు.

ప్రత్యేకశ్రేణి కార్యదర్శికి నోటీసు

మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీలు కూలీరేట్లు పెంచాలని కోరుతూ ఈనెల 15న హమాలీల సంఘం ఆధ్వర్యంలో మార్కెట్ కార్యదర్శికి నోటీసు ఇచ్చారు. ఏడురోజుల్లోగా కూలిరేట్ల సమస్యను పరిష్కరించకుంటే సెప్టెంబరు 22వ తేదీ నుంచి విధులకు పనులకు వచ్చేది లేదని నోటీసులో స్పష్టంగా పేర్కొన్నారు. కూలి పెంపుకోసం దాదాపు 11 నెలల నుంచి ఎదురు చూస్తున్నామని, రైతులను ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక వాయిదావేస్తున్న సర్దుకుపోతున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా తమ సమస్యను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ కూలీలు అధికారులు, ప్రజాప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇంజనీర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



కే.శ్రీనాథ్‌రెడ్డి



బి.సతీష్

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం బిలికాంనగర్‌లోని ఎస్ఈ కార్యాలయంలో ఎస్ఈ సీహెచ్.మనోహర్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా కే.శ్రీనాథ్‌రెడ్డి(డీఈఈ, మంత్రాలయం), ప్రధాన కార్యదర్శిగా బి.సతీష్(ఏఈ, కల్లూరు), ఉపాధ్యక్షుడిగా ప్రేమ్‌కుమార్(ఏఈ, ఎమ్మిగనూరు), కోశాధికారిగా హరిక(ఏఈఈ డివిజన్ కార్యాలయం), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మురళిమోహన్(ఏఈ, దేవనకొండ), మహిళా కార్యదర్శి గావి.వేద స్వరూప(ఏఈ)ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కర్నూలు, ఆదోని డివిజన్ల ఈఈలు అబ్దుల్ ఖాదిర్, పద్మజ, క్వాలిటీ కంట్రోల్ డీఈ మధుసూదన్ పాల్గొన్నారు.

కాడెద్దుల రికార్డు



పట్టణంలో ఎద్దులను ఊరేగింపుగా తీసుకొస్తున్న రైతులు

పట్టణంలో ఒకే రోజు 20ఎకరాల్లో పొగాకు పాపనం(గుంటిక) పాసి కాడెద్దులు రికార్డు సృష్టించాయి. పట్టణానికి చెందిన వెంకటరామిరెడ్డికి చెందిన కాడెద్దులు ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు 20 ఎకరాల్లో పొగాకు పాపనం పాసాయి. దీంతో మిత్రులు, శ్రేయోభిలాషులు ఎద్దులను, పాపనం గుంటికలు పట్టుకున్న ఇద్దరు రైతులకు దండలు వేసి పొలం దగ్గరి నుంచే మేళతాళాలతో పట్టణంలో ఊరేగించారు. రైతు వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ సాధారణంగా ఒక జత ఎద్దులు మహా అయితే 6నుంచి7 ఎకరాల్లో పాపనం పాస్తాయి. కానీ తన ఎద్దులు ఒకే రోజు 20 ఎకరాల్లో పొగాకు పంటలో పాపనం పాయడం గర్వంగా ఉందన్నారు.

● నందికొట్కూరు, ఆంధ్రజ్యోతి

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

నంద్యాల టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలంలోని సుగాలి మెట్ట వద్ద బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం బైకును ఢీకొనడంతో విద్యార్థి మృతి చెందాడు. ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా తెలిపిన వివరాలివీ.. నంద్యాల పట్టణం పెద్ద బండ ప్రాంతానికి చెందిన మహేంద్ర కుమారుడు మహావీర్ పెద్ద కొట్టాల నుంచి నంద్యాలకు వస్తుండగా సుగాలి మెట్ట వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో మహావీర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో విద్యార్థి సూర్యప్రకాశ్ పరిస్థితి విషమంగా ఉంది. చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై విచారిస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

కోనేరు రంగారావు సిఫారసులను అమలు చేయాలి

● కలెక్టరేట్ ఎదుట డీహెచ్‌పీఎస్ ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న మహేష్

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కోనేరు రంగారావు భూ సిఫారసులను తక్షణమే అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి సి.మహేష్ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట జిల్లా అధ్యక్షుడు రామచంద్ర అధ్యక్షతన ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ఎస్సీఎస్టీ, సబ్‌ప్లాన్ నిధులను ఇతర సంక్షేమ పథకాలకు మళ్లించి దళిత గిరిజనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయన్నారు. దళితులకు జనాభా దామాషా ప్రకారం రావాల్సిన నిధులు విడుదల చేయాలని, లేకుంటే దళిత, గిరిజన ప్రజా సంఘాలను కలుపు కుని ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, డీహెచ్‌పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కుమార్ రాజా, కోశాధికారి సి.కుమార్, అశోక్, ఉపాధ్యక్షురాలు విజయ, ఈశ్వర్, అంజి, పురుషోత్తం పాల్గొన్నారు.

'బీజేపీ కోసమే పని చేస్తున్న ఎన్నికల కమిషన్'

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ బీజేపీ కోసమే పని చేస్తోందని సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జీలానీ బాషా అన్నారు. బుధవారం నగరంలోని గడియారం హాస్పిటల్, పాత బస్టాండ్ సర్కిల్ ప్రాంతాల్లో దొంగ ఓట్లకు వ్యతిరేకంగా ఓటు చోర్.. గద్దే చోడ్ కార్యక్రమంలో భాగంగా ప్రజల సంతకాల సేకరణ కార్యక్ర మం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ఉద్య మానికి సంఘీభావంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఐన్ టీయూసీ ఈసీ జిల్లా అధ్యక్షులు బి. బ్రతుకన్న, దామోదరం రాధకృష్ణ, సయ్యద్ ఖాద్రీ బాషా, ఎస్సీ బజారన్న పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంతోనే శక్తివంతమైన కుటుంబం

● ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నవ్య



స్ర్కీనింగ్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యంతోనే శక్తివంతమైన కుటుంబం సాధ్యమని ఇన్‌చార్జి కలెక్టర్ డా.బి.నవ్య అన్నారు. బుధవారం నగరంలోని ఏ.క్యాంపు అర్బన్ హెల్త్ సెంటరులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ - సశక్తి పరివార్ అభియాన్ మాసోత్సవాలను ఇన్‌చార్జి కలెక్టర్ ప్రారంభించారు. ప్రతి స్త్రీ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం కూడా ఆరోగ్యంగా ఉంటుందనే ఉద్దేశంతో ప్రధానమంత్రి స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కా ర్యక్రమాన్ని బుధవారం దేశవ్యాప్తంగా ప్రారంభించారన్నారు. స్వస్థ్ పరివార్ అభియాన్ మాసోత్సవాలు సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా జరుగుతాయన్నారు. అనంతరం డీఎం హెచ్‌వో డా.పి.శాంతికళతో స్టేట్ నోడల్ ఆఫీసర్ రామనాథం, డా.నరేష్ కలిసి ఇన్‌చార్జి కలెక్టర్ మహిళల స్ర్కీనింగ్, బ్లడ్ డొనేషన్ కార్యక్ర మాలను ప్రారంభించారు. డీసీహెచ్ఎస్ డా.ఎస్. జఫ్రుల్లా, డీఐవో డా.నాగప్రసాద్, డీపీఎంవో డా.ఉమా, కార్పొరేటర్ పద్మలత, అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డా.మాధవి పాల్గొన్నారు.

కర్నూలు హాస్పిటల్: మహిళలు ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించాయని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ తెలిపారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ప్రసూతి విభాగంలో బుధవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ మాసోత్సవాల సందర్భంగా గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డా.హరిచరణ్, ప్రసూతి విభాగపు హెచ్‌వోడీ డా.సావిత్రి, ప్రొ.డా.జే.సంధ్య, పెథాలజి హెచ్‌వోడీ డా.బాలేశ్వరి, గర్భిణులు పాల్గొన్నారు.

కారణ జన్ముడు నరేంద్ర మోదీ : టీజీ వెంకటేశ్



రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ ఆధ్వర్యంలో రక్తదానం చేస్తున్న బీజేపీ నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కారణ జన్ముడని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా బుధవారం స్థానిక గౌరి గోపాల్ హాస్పిటల్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి టీజీ వెంకటేశ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ కొట్టే చెన్నయ్య రచించిన జాతీయ స్థాయిలో పద్మ అవార్డులు అందుకున్న వారి చరిత్రను తెలియజేస్తూ అనంత పద్మ కుసుమాలు అనే పుస్తకాన్ని టీజీ వెంకటేశ్ ద్వారా ఆవిష్కరించారు.

గూడూరు: బీజేపీ నాయకుడు గజేంద్ర గోపాల్ నాయకత్వంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్ నాయుడు, మండల అధ్యక్షుడు నవీన్ వేదవ్యాస్, పొన్నకల్ వెంకటేశ్, తారక్, వీరన్న, వేణు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు హాస్పిటల్: ఆయుష్మాన్ భారత్ రథసారధి మోదీ అని కర్నూలు జీజీహెచ్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు సీటీ సాయిప్రదీప్ అన్నారు. మోదీ జన్మదినం వేడుకలను ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ మోదీ నాయకత్వంలో భారతదేశం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. మాజీ కార్పొరేటర్ సారాయి రంగస్వామి, గీతామాధురి, కుర్ని వెంకటేశ్వర్లు, సునీల్‌రెడ్డి, ఉమా మహేశ్వరప్ప పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మహిళల హక్కుల కోసం పోరాటాలు

● ఐద్వా రాష్ట్ర నాయకురాలు నిర్మల

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళల హక్కుల కోసం నిరంతర పోరాటాలు కొనసాగించాలని ఐద్వా రాష్ట్ర నాయకురాలు పి.నిర్మల పిలుపునిచ్చారు. బుధవారం కేకే భవన్‌లో న్యూసిటి మూడవ నగర మహాసభ జే.కిరణ్మయి, శ్యామల అధ్యక్షతన నిర్వహించారు.అనంతరం న్యూసిటి నూతన కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. జిల్లా కార్యదర్శి అలివేలమ్మ, అధ్యక్ష, కార్యదర్శులు యం.కుమారి, ఎస్.శ్యామలమ్మ, గౌరవ అధ్యక్షుడు ఈఎల్.ఎస్. రత్నమ్మ, జి.ధనలక్ష్మి పాల్గొన్నారు.

రెడ్ బుక్ రాజ్యాంగం అమలు : వైసీపీ

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి అన్నారు. బుధవారం ఎస్వీ కాంప్లెక్స్ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. ఈ నెల 19న చలో ఆదోని మెడికల్ కళాశాల' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. వైసీపీ యువజన విభాగం సభ్యుడు నవీన్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయించాలి

కర్నూలు రూరల్ సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏపీ బిల్డింగ్ నిర్మాణ వర్కర్స్ యూనియన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప, ఏపీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కన్వీనర్ నల్లన్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి వినతిపత్రం ఇచ్చారు.

సేవల్లో ప్రజల సంతృప్తి స్థాయి పెరగాలి

కల్లూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సేవలు అందించడంలో ప్రజలకు సంతృప్త స్థాయి పెంచేలా ఆశాఖ ఉన్నతాదికారులు చర్యలు చేపట్టనున్నారు. గురువారం దూపాడులోని కేవి.సుబ్బారెడ్డి పార్మసీ ఆడిటోరియంలో ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కే.సంతోషరావు హాజరై ఉద్యోగులకు అవగాహన కల్పించనున్నారు.

ఆలయానికి నిధుల మంజూరుపై హర్షం

ఓర్వకల్లు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉయ్యాలవాడ గ్రామ కొండపై వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయానికి రోడ్డు వేసేందుకు టీటీడీ బోర్డు రూ.1.83 కోట్లు మంజూరు చేయ డంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం హుశేనాపురంలో టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్‌ను సన్మారు సొసైటీ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, మాజీ ఎంపీటీసీ రమణారెడ్డి, టీడీపీ నాయకులు సన్మానించారు.

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక అవుట్ డోర్ స్టేడియంలో ఈ నెల 19వ తేదీ శుక్రవారం జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు అండర్-14, 16, 18, 20 బాలబాలికలకు అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు జరుగుతాయనీ అథ్లెటిక్స్ కార్యదర్శి సుబ్బరత్నాలు తెలిపారు. పోటీల్లో మంచి ప్రతిభ చూసి రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 27, 28, 29 తేదీల్లో ఏలూరు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్‌పోటీల్లో పాల్గొంటారు. ఈ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు జనన ధృవీకరణ పత్రం, ఆదార్ కార్డుతో రావాలని సెక్రటరీ లక్ష్మయ్య తెలిపారు. వివరాల కోసం 8919409232, 9493323964లను సంప్రదించాలన్నారు.

టీడీపీ కార్యకర్తకు ఎమ్మెల్యే నివాళి



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

ఓర్వకల్లు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్త బొల్లవరం వెంకటేశ్వర్లు మృతి తీరని లోటు అని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, టీడీపీ నాయకుడు గౌరు వెంకటరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కన్నమడకల గ్రామంలో వెంకటేశ్వర్లు (55)కు ఎమ్మెల్యే నివాళులర్పించారు. ఆమెతో పాటు టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సుధాకర్ రావు, నాగేశ్వరరెడ్డి, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, జడ్పీటీసీ రంగనాథగౌడు, విశ్వేశ్వరరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, రాం భూపాల్ రెడ్డి, బ్రాహ్మనపల్లె నాగిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఆకుల మహేష్, నాగమల్లేష్, సీపీఎం రామకృష్ణ, నాయకులు తదితరులు నివాళులర్పించారు.

'నగర బ్రాహ్మణ సంఘాన్ని బలోపేతం చేయండి'

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగర బ్రాహ్మణ సంఘాన్ని బలోపేతం చేయాలని ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కె. బుచ్చి రాంప్రసాద్ సూచించారు. బుధవారం విజయవాడలోని ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ కార్యాలయంలో నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ అధ్యక్షతన సంఘం ప్రతినిధులు రాంప్రసాద్‌ను కలిశారు.

మంత్రి అచ్చెన్నాయుడిని కలిసిన ఎంపీ



మంత్రిని కలిసిన ఎంపీ

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడిని ఎంపీ బస్తిపాటి బుధవారం విజయవాడలోని మంత్రి చాంబర్లో కలిసి యూరియా కొరత లేకుం డాచూడాలని కోరారు. ఆయన్ను శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మా ట్లాడుతూ రైతులు యూరియాపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఇంటి పట్టా మంజూరు

కర్నూలు రూరల్ సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే చేతిలో లైంగిక వేధింపులకు గురైన ఓ బాధితురాలికి ప్రభుత్వం ఇంటి స్థలం మంజూరు చేసింది. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, కర్నూలు రూరల్ తహసీల్దార్ వెంకటరమేష్‌బాబు పట్టాను అందజేశారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. బుధవారం స్థానిక బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల ఉద్యోగులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా డిస్ట్రిక్ట్ ఎస్సీ వెల్ఫేర్ ఎంపోర్‌మెంట్ ఆఫీసర్ రాధిక, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రసూన, ఎస్టీ వేల్ఫేర్ ఆఫీసర్ కొండయ్య, జిల్లా అధ్యక్షుడిగా ఎస్‌డబ్ల్యూవో బి.మద్దిలేటి, జనరల్ సెక్రటరీగా పి.శ్రీనివాసులు, కోశాధికారిగా ఎం.ఓబులేసు, అసోసి యేట్ ప్రెసిడెంటుగా కే.బాబు (ఎస్‌డబ్ల్యూవో), ఏబీసీ డబ్ల్యూవో ఎం.శ్రీనివాసులు, ఏబీసీ డబ్ల్యూవో ఆంజనేయులు, ఏఎస్‌డబ్ల్యూవో లీలావతి, మారెప్పతో పాటు వైస్ ప్రెసిడెంట్స్ ఆర్గనై జింగ్ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీగానూ 13 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

విద్యుత్ ఉద్యోగుల ధర్నా

కల్లూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ కర్నూలు జేఏసీ చైర్మన్ సతీష్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు విద్యుత్ కార్యాలయం ముందు కర్నూలు మధ్యాహ్నం ధర్నా నిర్వహించారు.

విజేతలకు అభినందనలు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన వెయిట్ లిఫ్టింగ్, కరాటే పోటీల్లో కట్టమంచి రామలింగారెడ్డి మెమోరియల్ మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్ విద్యార్థులు విజయం సాధించారు. హెచ్ఎం వెంకటరెడ్డి ఎస్ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు అభినందించారు.

న్యాయవాదుల ర్యాలీ



కర్నూలు లీగల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేయాలని కోరుతూ హైకోర్టు సాధన సమితి ఆధ్వర్యంలో స్థానిక న్యాయవాదులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణం నుంచి పాత బస్టాండులోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిం చారు. న్యాయవాదులు బి.చంద్రుడు, నరసింహ, నాగరాజు, రా మాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ పోటీలకు గార్గేయపురం విద్యార్థులు

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ నెట్‌బాల్ పోటలకు జడ్పీహెచ్ఎస్ గార్గేయాపురం క్రీడాకారులు ఎంపికయ్యారని హెచ్ఎం వెంకట్రాముడు తెలిపారు. ఆర్.శిరోమణి, ఆర్.అనన్య, చాణక్యవరప్రసాద్, అండర్-17 విభాగం, తవరన్ ఆలీ (అండర్-14) ఎంపికయ్యారు. ఆర్.వల్లి అండర్-14 విభాగంలో ఎంపికయ్యారని పాఠశాల పీఈటీలు పాల్ విజయ్, రాజశేఖర్ తెలిపారు.

రక్తదానంపై అవగాహన అవసరం

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): యువతలో రక్తదానం పట్ల అవగాహన అవసరమని ఉప కులపత వి. వెంకట బసవరావు అన్నారు. బుధవారం రాయల సీమ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్, అఖిల భారతీయ తెరపంత్‌యువపరిషత్‌ల సం యుక్త ఆధ్వర్యంలో రక్తదాన్ అమృత్ మహోత్సవ్ 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి. నాగరాజు, కె. వెంకటరత్నం, రెడ్‌క్రాస్ సొసైటీ డాక్టర్ పాల్గొన్నారు.

యోగాలో గ్రేడ్-1 న్యాయ నిర్ణేతలుగా జిల్లావాసులు

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హర్యానా వేదికగా నిర్వహించిన ఆన్‌లై న్ గ్రేడ్-1 న్యాయ నిర్ణేతల పరీక్షలో కర్నూలు జిల్లా వాసులు డా.ఎన్. ముంతాజ్‌బేగం, కురువ మునిస్వామి పాల్గొని అర్హత సాధించినట్లు రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అవినాశ్ శెట్టి, ఉపాధ్యక్షుడు హర్షం వ్యక్తం చేశారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని లద్దగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి భా స్కర్ అన్నారు. 'స్వస్త్ నారీ-సశక్త్ పరివార్ అభి యాన్'లో భాగంగా బుధవారం పీహెచ్‌సీలో అవగాహన కార్య క్రమం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి వ్రత మహాయజ్ఞం

ఓర్వకల్లు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కోదండ రామస్వామి ఆలయంలో 1100వ ఏకాదశి వ్రత మహాయజ్ఞం నిర్వహించారు. దాత విజయుడు వినాయకుని ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

కర్నూలు క్రైం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలను నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ కష్టపడేతత్వం, పట్టుదల, నైపుణ్యం ఉంటే ఏదైనా సాధించవచ్చనే సందేశాన్ని విశ్వకర్మ ద్వారా మనం నేర్చుకోవచ్చన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

కర్నూలు రూరల్ సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి బుధవారం సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను అందజేశారు. బెలగల్ మండలం పలుదొడ్డి గ్రామానికి చెందిన నాగేంద్ర మృతిచెందడంతో ఆయన భార్య వెంకటేశ్వరమ్మకు రూ.196,703లను మంజూరు చేయించారు. అలాగే బాలాజీ నగర్‌కు చెందిన షేక్ ముబీనబేగంకు రూ.20,000ల చెక్కును అందజేశారు. అనంతరం ముల్లా రహిమాన్ ఆయన భార్యకు రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో వారిని ఎమ్మెల్యే పరామర్శించారు.

నగర ప్రజల వినోదంపై ప్రత్యేక దృష్టి

● కమిషనర్ విశ్వనాథ్



ఇండోర్ స్టేడియాన్ని పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రజలకు మెరుగైన వినోద సౌకర్యాలు, ఆహ్లాదకర వాతావరణం కల్పిం చేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. బుధ వారం ఆయన జొహరాపురం రోడ్డులోని ఇండోర్ స్టేడియం, టెన్నిస్ కోర్టు, సీఅండ్‌డీ వేస్ట్ మేనేజ్ మెంట్ ప్లాంట్, మున్సిపల్ పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యకరమైన వాతా వరణం అందిం చేందుకు ఇండోర్ స్టేడియం చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలన్నారు. ఉదయం పూట వ్యాయామం, వినోదం కోసం వచ్చే ప్రజలు ఉపయో గించుకునేలా శుభ్రత పనులు పకడ్బందీగా నిర్వ హించాలని ఆదేశించారు.

రేపు ఎల్ఆర్ఎస్ పథకంపై మేళా

అనధికార లేఅవుట్ల క్రమబద్దీకరణ (ఎల్ఆర్ఎస్) పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 19న శుక్రవారం ఎల్ఆర్ ఎస్ మేళా నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. ప్రజలు, దరఖాస్తుదారులు తమ సందేహాలను చర్చించి నివృత్తి చేసుకోవచ్చన్నారు.

కర్నూలు కల్చరల్ : నగర ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా నగరపాలక వర్గం తీసుకున్న తీర్మానానికి అనుగుణంగా వెండర్ జోన్లను ఏర్పాటు చేస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. బుధవారం సాయంత్రం నగరపాలక కార్యాలయంలో టౌన్ వెండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పాలకవర్గ సర్వసభ్య సమావేశంలో నగరంలోని 127 ప్రాంతాలను రెడ్, గ్రీన్, అంబర్ జోన్లుగా విభజించిన తీర్మానాన్ని కమిటీ ఆమోదించిందని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో వీధి వ్యాపారాలు నిషేధంగా, మరికొన్ని ప్రాంతాల్లో పండుగల వంటి ప్రత్యేక సందర్భాల్లో అనుమ తించేలా జోన్ల ఏర్పాటు జరుగుతుందన్నారు. ప్రజలకు ఇబ్బంది లేని ప్రాంతాల్లో గుర్తింపు పొందిన వ్యాపారులను అనుమతించేందుకు కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. స్మార్ట్ సిటీలో భాగంగా అశోక్ నగర్‌లో 40, బిర్లా కాంపౌండ్‌లో 10 షాపుల ఏర్పాటు, తొలగించిన చిరువ్యాపారులకు అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుం టున్నట్లు తెలిపారు. మరిన్ని ప్రాంతాల్లో స్ట్రీట్ వెండర్ జోన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూ పొందించాలని కమిటీ నిర్ణయించిందని కమిషనర్ పేర్కొన్నారు. పీఎం స్వానిధి పథకానికి సంబం ధించి కొత్త మార్గదర్శకాల ప్రకారం రుణ పరి మితిని పెంచి నట్లు తెలిపారు. తొలి విడత రూ. 10 వేలను రూ.15 వేలుగా, రెండో విడత రూ.20 వేలను రూ.25 వేలుగా పెంచారని, మూడో విడత రూ.50వేలు కొనసాగుతుందన్నారు. ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రైతు చిత్తు!

● ఆగని వర్షాలు ● ఎర్రబారుతున్న పంటలు
● ఆందోళనలో రైతులు ● ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

రైతులను వర్షాలు కునుకు లేకుండా చేస్తున్నాయి. ఆదోని డివిజన్‌లో నెల రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తుండడంతో పంట లన్నీ దెబ్బతిన్నాయి. ఈ ఏడాది మొదట్లో వర్షాలు బాగా కురవ డంతో ముందస్తుగా పత్తి, మిరప, వేరుశనగ, కంది, ఉల్లి, తదితర పంటలను సాగు చేశారు. పంటలు కూడా బాగానే ఉండడంతో ఎంతో సంబర పడ్డారు. ఉన్నంటుండి నెల రోజుల నుంచి వర్షాలు ఆగకుండా పడుతుండడంతో వేర్లతో సహా పంటలన్నీ కుళ్లిపోతున్నాయని రైతులు లబోదిబోమంటున్నారు. ఎక రాకు సుమారు 50 వేల వరకు పెట్టు బడి పెట్టామని, కళ్లెదుటే పంటలు నాశమవుతున్నా చూస్తూ ఉండిపోతున్నామే తప్ప ఏమీ చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


చెట్టుపైనే కుళ్లిపోతున్న పత్తికాయలు


దెబ్బతిన్న ఉల్లి


బీరకాయ పంట

మద్దికెర, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో తుపాన్ ప్రభావం వల్ల కురుస్తున్న భారీ వర్షాలకు టమోటా, బీర, పెసర పంటలు ఎర్రబారుతు న్నాయి. అలాగే పూత, కాయలు రాలిపోతున్నాయి. నేలలో నీరు నిల్వ ఉండటంతో మొక్కలు ఎర్రబారడమే కాకుండా పెసర, బీరకాయ పంటలు కుళ్లిపోతు న్నాయి. టమోటా, బీరకాయ, పెసర, దాదాపు 5వేల ఎకరాల్లో సాగు చేశారు. జూన్‌లో వర్షాలు కురిసినట్లే కురిసి కని పించకుండా పోయాయి.


ఎదుగుదల లేక పత్తి పంట ఇలా..

పెట్టుబడి పెరిగి.. దిగుబడి తగ్గి..

దేవనకొండ: పత్తి రైతు చిత్తయ్యాడు. వరుస వర్షాలతో పత్తి పంట దిగుబడి ఆశించినంతగా రాలేదు. వర్షాలతో పత్తిపంటకు ఎర్ర తెగుళ్లు, గులాబి పురుగు, దోమ్మతో పాటు పూత, పిందెలు రాలి పోతున్నాయి. మండలంలో ప్రధాన పంటగా పత్తి దాదాపు 40 వేల ఎకరాలకు పైగా అత్యధికంగా సాగు చేశారు. ఎడతెరిపి లేని వర్షాలకు పత్తి మొక్కలు వైరస్‌ల బారిన పడి ఎర్రతె గుళ్లతో పంట కోత రెండు లేదా మూడు సార్లకే పరి మితమవుతుంది. ఎకరాకు రూ.30 నుంచి 40 వేల దాకా పెట్టుబడులు పెట్టి సాగు చేస్తే దిగుబడులు ఆశించిన తంగా రాకపోవడంతో పత్తి రైతు చిత్తవుతున్నాడు.

పెట్టుబడి రాదు..

మూడు ఎకరాలలో పత్తి సాగు చేస్తే రూ.లక్ష పెట్టుబడి అయ్యింది. మొదటి కోతలో ఆరు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. రెండో కోతకు అధిక వర్షాలతో కాయ సరిగా పగలకపోవడంతో గొగ్గి ఎక్కువగా ఉంది. వరుస వర్షాలతో ఆశించిన దిగు బడి రాలేదు.

● మాబాషా, దేవనకొండ


దెబ్బతిన్న పెసర పంట

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన మాజీ ఎమ్మెల్యే

ఆదోని, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.15,15,000 విలువైన చెక్కులను మాజీ ఎమ్మెల్యే మీనా క్షినాయుడు ఆయన స్వగృహంలో బుధవారం 46 మంది లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు వాల్మీకి తిమ్మ ప్ప, మండలాధ్యక్షుడు దొడ్డనకేరి శివప్ప, ప్రెసిడెంట్ బసాపురం రామ స్వామి, బసవరాజు, మారుతీరావు, సాధికాబేగం, సుబ్బు పాల్గొన్నారు.

టీడీపీ కమిటీలో అవకాశం


మీనాక్షినాయుడు, భూపల్‌చౌదరిని గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం


తెలుగు యువత రాష్ట్ర నాయకుడు మారుతీనాయుడిని సన్మానిస్తున్న శివప్ప, తిమ్మప్ప

ఆదోని, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆదోని పట్టణ కమిటీ అధ్య క్షుడిగా వాల్మీకి తిమ్మప్ప, మండల కమిటీ అధ్యక్షుడిగా దొడ్డనకేరి శివప్ప లను అధిష్టానం నియమించినట్లు మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగా నియమితులైన నాయకులతో పాటు కమిటీ సభ్యులను కూడా పార్టీ ప్రకటించినట్లు తెలిపారు. ఎన్నికైన అధ్యక్షులను కార్యకర్తలు, నాయకులు అభినందించి, సన్మానించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థినులు

వెల్దుర్తి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీలకు కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు స్పెషల్ ఆఫీసర్ షాకీరాబేగం బుధవారం తెలిపారు. ఈనెల 15న కర్నూలులో నిర్వహిం చిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో ఎనిమిది మంది విద్యార్థులు పాల్గొని రాణించారన్నారు. అండర్-14 నెట్‌బాల్‌లో పూజ, అండర్-17 నెట్ బాల్‌లో క్రాంతికుమారి, స్వప్న, అండర్-19 రగ్బీలో మనీషా, టేబుల్ టెన్ని స్‌లో సునిత, నెట్‌బాల్‌లో వైష్ణవి, అను, మనీషాలు అత్యుత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని అన్నారు.

హొళగుంద: ఆంధ్రకబడ్డీ సంఘం ఆధ్వర్యంలో ఇటీవలే కోసిగిలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ అండర్-14 సెలెక్షన్ లో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు హొళగుంద జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు భూమిక, ఐశ్వర్య, అనురాధ, గాయత్రీ ఎంపికైనట్లు హెచ్ఎం ఖబీర్ సాబ్ బుధ వారం తెలిపారు. సెప్టెంబర్ 25 నుండి 28 వరకు కడప జిల్లా గల్లాపుడి లో నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో కర్నూల్ జిల్లా తరపున పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పీఈటీ పెద్ద మహబూబ్ భాషా, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉల్లి రైతులు ఈక్రాప్ నమోదు చేసుకోవాలి

మద్దికెర సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఖరీఫ్‌లో ఉల్లి పంట సాగు చేసిన రైతులు ఈక్రాఫ్ నమోదు చేసుకోవాలని తహసీల్దార్ గూండాల్ నాయక్, వ్యవసాయ శాఖ అధికారి రవి తెలిపారు. బుధవారం మండలంలోని మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో రైతులు సాగు చేసిన ఉల్లి పంటను పరిశీలించారు. ఉల్లి పంట దెబ్బతిని ఉంటే వీఆర్వోల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ఆనంద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

ఆదోని రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్య లను పరిష్కరించాలని సీపీఎం నాయకులు లింగన్న తెలిపారు. సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం మండల కార్యాలయాన్ని ముట్టడించి ఎంపీడీవో జనార్దన్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కనీసం గ్రామాలవైపు కన్నెత్తి చూడడం లేదన్నారు.

కొలువుదీరనున్న మార్కెట్ కమిటీ పాలకవర్గం

● అక్టోబరు 4న ప్రమాణ స్వీకారం


జిందే శారదా శంకర్   ఆదూరి విజయ్ కృష్ణ

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే అతిపెద్ద రెండవ వ్యవసాయ మార్కెట్ అయిన వ్యవసాయ మార్కెట్‌యార్డ్ పాలక వర్గం ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. గత నెల చైర్మన్ జిందే శారద శంకర్ పేరును ప్రకటించింది. చైర్మన్ పదవి టీడీపీకి కేటాయించడంతో బీజేపీ వైస్ చైర్మ న్‌తో పాటు మరో ముగ్గురి సభ్యులుగా, జనసేన ఇద్దరు సభ్యులు ఉండేందుకు భాగస్వామ్యం చేసింది. మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆమోదం తెలు పుతూ 15తేదీన జీవో ఆర్‌టీ నెంబర్ 810 విడుదల చేసింది.

కొత్త పాలకవర్గం వీరే: గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, చైర్మన్ గా జిందే శారద శంకర్(టీడీపీ), వైస్ చైర్మన్ ఆదూరి విజయ్ కృష్ణ(బీజేపీ), టీడీ పీకి చెందిన సభ్యులు ఉరుకుంద రెడ్డి, బోయ కాశన్న, దాసరి శారద, ఫర్హానా భేగం, కె పల్లవి వెంకటేష్, బ్రహ్మానందం, బింగి సూర్య మనోహర్ రావు, బీజేపీ చెందిన సభ్యులు శ్రీనివాసాచారి, రామకృష్ణ, రత్నాభాయి, మహేశ్వరి, జనసేన కు చెందిన పింజారి ఖాదర్ బాషా, పీఎస్ పార్వతీ ఉన్నారు. అక్టోబర్ 4న ప్రమాణ స్వీకారం చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్ల జిల్లా మహాస భలను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి గౌస్‌చంద్ర, ఆశావ ర్కర్స్ యూనియన్ కార్యదర్శి పావనిలు పిలుపునిచ్చారు. బుధవారం పుచ్చకల మాడ పీహెచ్‌సీలో ఆశావర్కర్ల యూనియన్ జిల్లా మహాసభల సందర్భంగా జరి గిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 23న కర్నూలు నగరంలో కార్మిక, కర్షకభవన్‌లో జరిగే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపుని చ్చారు. అనంతరం ఆశావర్కర్లు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని వైద్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు స్వాతి, వెంకటేశ్వరమ్మ, అనిత, రాధ, సునీత తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అలసత్వం వీడండి : జడ్పీ సీఈవో

ఆదోని రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామస్థాయిలో పంచా యతీ కార్యదర్శులు, సిబ్బంది అలసత్వం వీడి సక్రమంగా విధులు నిర్వహించాలని జడ్పీ సీఈవో నాసరరెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడీవో జనార్దన్‌తో కలిసి చెత్త సేకరణలో వెనుకబడి ఉన్న దిబ్బనకల్లు గ్రామాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. జడ్పీసీఈవో వీధి వీధిన తిరిగి ప్రజాసేకరణ చేశారు. ప్రజాసేకరణలో విస్తు పోయే విషయాలను విని ఆయన సిబ్బందిపై మండిపడ్డారు. గ్రామస్థులు చెత్త సేకరణకు పంచాయతీ పారిశుధ్య కార్మికులు రావడం లేదని, వాటర్‌ట్యాంకు ఎప్పుడు శుభ్రం చేశారో తెలియదని, కాల్వలు కూడా శుభ్రం చేసిన దాఖలాలు లేవని ప్రజలు చెప్పారు. జడ్పీసీఈవో తక్షణమే పంచాయతీ కార్యదర్శి బాబుకు షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఎంపీడీవోకు ఆదేశించారు. కార్యదర్శులు, సిబ్బంది విధుల పట్ల అలసత్వం వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైతు అభివృద్ధే టీడీపీ లక్ష్యం


మాట్లాడుతున్న నబీసాహెబ్

పత్తికొండ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతు అభివృద్ధే ప్రభుత్వం ధ్యేయమని మార్కెట్‌యార్డు చైర్మన్ ఆలంకొండ నబీసాహెబ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పత్తికొండ మార్కెట్‌యార్డులో టమోటా పంటకు గిట్టుబాటు ధరను కల్పిస్తూ రైతులు నష్టపోకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. రూ.8 గిట్టుబాటు ధరతో మార్కెట్‌యార్డు ద్వారా మూడురోజుల్లో సుమారు 36టన్నుల టమోటాను కొనుగోలు చేశామన్నారు. అయితే మాజీ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి సోమవారం మార్కెట్‌యార్డును సందర్శించి టమోటాకు రైతులకు గిట్టుబాటు ధరను ప్రభుత్వం అందించడం లేదని తప్పుడు ఆరోపణలకు దిగడం హాస్యాస్పద మన్నారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారాలకు దిగడం సరికాదని ఆమెకు హితవు పలికారు. సమావేశంలో డైరక్టర్లు రంగా, దేవేంద్ర, టీడీపీ నాయకులు మద్రిశ్రీరాములు, గురుస్వామి, శివరాముడు, కార్యదర్శి కార్నలీస్‌లు ఉన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

వెల్దుర్తి టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను తీర్చిదిద్దడమే ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమ ఉద్దేశమని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ రమణారెడ్డి, డీఆర్‌డీఏ ఏపీఎం అనురాధ తెలిపారు. బుధ వారం మండలంలోని శ్రీశక్తి భవనంలో ఉల్లాష్ అక్షర ఆంధ్ర కార్యక్రమంపై వలంటరీ టీచర్స్ శిక్షణ కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, ఏపీఎం అనురాధతో పాటు ఈవోఆ ర్‌డీ, జిల్లా వయోజన విద్యా అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీ సర్ బి.ప్రతాప్, సూపర్‌వైజర్ కే.రమణయ్య హాజర య్యారు. పీడీ రమణారెడ్డి మాట్లాడుతూ మండలంలో మొత్తం 8655 మంది మహిళలు నిరక్షరాస్యులు ఉన్నా రని, వారిని అక్షరాస్యులుగా చేయడం జరుగుతుంద న్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టు మిషన్ అందజేత


వీణ కుటుంబానికి కుట్టు మిషన్ అందజేస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఆదోని, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆదోని పట్ట ణానికి చెందిన వీణ కుటుంబానికి సబ్‌కలెక్టర్ మౌర్యభ రద్వాజ్ పీ-4 విధానం కింద బంగారు కుటుంబంగా దత్తత తీసుకున్నారు. బుధవారం సబ్‌కలెక్టర్ కార్యాల యంలో ఆ కుటుంబానికి కుట్టు మిషన్‌ను అందజే శారు. కార్యక్రమంలో ఇందిరానగర్ కౌన్సిలర్ చలపతి, సర్వేయర్ వేణుసూర్య, డీటీలు రాఘవేంద్ర, కౌసర్‌భాను పాల్గొన్నారు.

పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఆలూరు రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా సక్రమంగా అందిస్తామని విద్యుత్ శాఖ డీఈఈ లత, ఆలూరు ఏడీఏ సంతోష్‌కు మార్ అన్నారు. ఆలూరు సబ్‌స్టేషన్‌లో బుధవారం రూ.1.50కోట్లతో 8 యంవీఏ పవర్ ట్రాన్స్‌పార్మర్‌ను విద్యుత్ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఈఈ లత, డిప్యూటీ డీఈ సంతోష్‌లు ప్రారంభించారు. కార్యక్ర మంలో ఏడీఏ గురురాజ్, ఏఈ గుర్రప్ప, కాంట్రాక్టర్లు సోమశేఖరయ్యస్వామి, భీమప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

యాత్రను జయప్రదం చేయాలి

ఆలూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన రాజ్యాంగ పరిరక్షణ యాత్ర 26న కర్నూలుకు రానుందని, మాల సామాజిక వర్గానికి చెందిన నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు హాజరై జయప్రదం చేయాలని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె మహానంది పిలుపునిచ్చారు. బుధవారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మండల నాయులు జట్టప్ప వీరేష్ అధ్యక్షతన రాజ్యాంగ పరిర క్షణ యాత్ర కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్ర మంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల నియోజకవర్గ అధ్య క్షులు కుంకనూరు పాండు, యువజన సంఘం జిల్లా కన్వీనర్ భరత్, మాల మహానాడు సీనియర్ నాయ కులు లక్ష్మీనారాయణ, చిరంజీవి, ఆనంద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రజా విశ్వాసాన్ని కోల్పోయింది: బీజేపీ

ఆదోని టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : దొంగ ఓట్లతో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిం దని కాంగ్రెస్ పెద్దలు ఆరోపించడాన్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని బీజేపీ ఆదోని అసెంబ్లీ కో కన్వీనర్ నాగరాజు గౌడ్ విమర్శించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య బద్ధంగా జరిగిన ఎన్నిక లలో ప్రజల ఓట్లతో గెలిచి చూపించాలే కానీ, ఓట్‌చోర్ అని అనవసర విమర్శలు చేస్తే కాంగ్రెస్ పార్టీను ప్రజలు దేశం నుంచి తరిమి కొట్టే రోజు వస్తుందని హెచ్చరించారు. నాయకులు అంజయ్ కుమార్, మరి యాని చెన్న బసప్ప, మహాదేవ పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

ఆస్పరి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో పనిచేసే శ్రామి కులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఉపా ధిహామీ పథకం ఏపీడీ పక్కీరప్ప తెలిపారు. బుధ వారం ఆస్పరిలోని సీనియర్ బేటీలు శ్రామికులతో ఈకే వైసీ చేస్తుండగా ఏపీడీ పక్కీరప్ప, ఏపీఓ రామకృష్ణ పరిశీలించారు. వారు మాట్లాడుతూ 30వ తేదీలోగా ఈకేవైసీ పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అక్బర్, ప్రభాకర్, మారన్న, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొ న్నారు.

'కమ్మ'ల అభివృద్ధికి కృషి చేయాలి

తుగ్గలి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కమ్మ కులస్థుల ఎదుగుదల కోసం కృషి చేయాలని, అలాగే పేద విద్యార్థులకు చేయూత ఇచ్చి ఉన్నత చదువులు అభ్యసించేలా ప్రభుత్వం కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు మనోహర్ చౌదరి కోరారు. బుధవరం విజయవాడలో క్యాంపు కార్యాలయంలో కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మయ్య చౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను వివ రించారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మద్దికెర సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ మంత్రి కాల్వశ్రీనివాసులు కోరారు. బుధవారం మండలంలోని ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మాజీ ఎంపీటీసీ సుదాకర్ చౌదరి, మాజీ సర్పంచ్ లక్ష్మన్న, శివశంకర్, నర్రా సుధాకర్ కలిశారు.

బడ్జెట్‌ను విడుదల చేయాలి

ఆలూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష ప్రాజెక్టు పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యో గులకు ఆగస్టు నెల వేతనాలకు సంబంధించి బడ్జెట్‌ను విడు దల చేయాలని బుధవారం స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు మన్సూర్‌అహ మ్మద్, లక్ష్మన్న మాట్లాడుతూ 17వ తేదీన గడిచినా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ప్రతినెలా 1న జీతాలు వచ్చేవిధంగా చూడాలని కోరారు. కార్య క్రమంలో సీఆర్‌పీలు బాబర్‌బాషా, గాదిలింగప్ప, వీరభద్ర స్వామి పాల్గొన్నారు.

ఆదోని అగ్రికల్చర్: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి వీరేష్ డిమాండ్ చేశా రు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద డీహెచ్ పీఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. అనంతరం డి ప్యూటీ తహసీల్దార్ బాబుకు వినతిపత్రం అందజేశారు. కార్య క్రమంలో కుమారస్వామి, విజయ్, రమేష్, రంజిత్ గౌడ్, సురేష్, గోపాల్ పాల్గొన్నారు.

ఎంఈవో పోస్టు కేటాయించాలి

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పరిధిలో ఉన్న పాఠశాలల పర్యవేక్షణకు అర్బ న్ ఎంఈవో పోస్టును కేటాయించాలని ఎస్‌టీయూ రాష్ట్ర ఉపా ధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్రయా దవ్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని మునిసిపల్ పాఠశాలలో ఎస్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ మునిసిపాలిటీ పరిధిలో ఉన్న కొన్ని పాఠశాలలకు అప్‌గ్రేడ్ చేశారన్నారు. విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, పాఠశాలల పర్యవేక్షణకు అర్బన్ ఎంఈవో పోస్ట్ మంజూరు చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్ నాయుడు, రవి, బీమరాజు, లోక్యానాయక్, ప్రహ్లద్, గంగానాయక్ పాల్గొన్నారు.

బీజేపీలో కార్యకర్తలకు గుర్తింపు

ఆదోని టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బీజేపీలో పనిచేసిన కార్యకర్తలకు ఖచ్చితంగా గుర్తింపు లభిస్తుందని ఆదోని మార్కెట్ యార్డ్‌కు వైస్ చైర్మన్‌గా ఎంపికైన ఆధూరి విజయకృష్ణ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 2006లో ఏబీవీపీ విద్యార్థి నాయకుడిగా పార్టీలో చేరిన తాను పార్టీ పురోభివృద్ధి కోసం చేసిన కృషి చేశానని, ఇది గుర్తించి ఎమ్మెల్యే, పార్టీ పెద్దలు ఈ పదవి అప్పజెప్పడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్‌యార్డు అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

కూలిన మట్టి మిద్దె

వెల్దుర్తి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఎస్.బోయినపల్లి గ్రామంలో కుంటల మాదేవి, కుంటల ఎల్లయ్య మట్టి మిద్దె మంగళవారం కూలింది. రాత్రి ఐదుగురు కుటుంబసభ్యులు ఇంటిలో ఉన్న బయటి గదిలో నిద్రపోయారు. ఉదయం లేచి చూడగా లోపలి గది కూ లిపోయింది. ప్రాణపాయం తప్ప డంతో ఊపిరి పీల్చుకున్నారు. రూ.50 వేలు ఆస్తినష్టం వాటి ల్లిందని తెలిపారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

ఆదోని రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశానికి ఎంపిటీసీలు గైర్హాజరు కావ డంతోపాటు కోరం లేకపోవడంతో సమావేశాన్ని ఎంపీడీవో జనార్దన్ వాయిదా వేశారు. గురువారం స్థానిక ఎంపీపీ భవ నంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి సర్పంచులు, అధికారులతోపాటు సంతేకు డ్లూరు ఎంపీటీసీ కమలమ్మ, ఎంపీపీ బడాయి దానమ్మ, మండల, జెడ్పి కో-అప్షన్ మెంబర్లు మాత్రమే హాజరయ్యారు. దాదాపు ఒంటిగంట వరకు ఎంపీటీసీల కోసం అధికారులు ఎదురు చూశారు. ఎంపిటీసీలు గైర్హాజరు కావడం, కోరం లేక పోవడంతో వాయిదా వేశారు. మండలంలో ప్రస్తుతానికి 23మంది ఎంపీటీసీలు ఉన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

ఆదోని రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆరేకల్లులో నేర నియంత్రణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ రామాంజ నేయులు తెలిపారు. దాదాపు 5 కెమెరాలను పెద్ద పెండేకల్లు క్రాస్‌లో, గ్రామంలోని పలు చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు.

● పెద్దహరివాణం పేకాట స్థావరంపై ఇస్పీ పోలీసులు దాడులు నిర్వహించారు. గంగమ్మ దేవాలయం వద్ద పేకాట ఆడుతున్న 8మందిని అరెస్టు చేసి ఎస్ఐ నాయక్ తెలిపారు.


ఆదోనిలో రక్తదానం శిబిరాన్ని ప్రారంభించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ


హొళగుందలో..


ఆలూరు ఆసుపత్రిలో రోగులకు బెడ్లు, పండ్లను పంపిణీ చేస్తున్న నాయకులు

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వే డుకలను బీజేపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ సంబరాలు చేసు కున్నారు. అనంతరం ఆసుపత్రుల్లో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. దేశంలోని అన్నివ ర్గాల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర మోదీ నిరంతరం కృషిచేస్తున్నారని నాయ కులు అన్నారు. - ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్


తుగ్గలిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు


చిప్పగిరి తహసీల్దార్ కార్యాల యానికి ప్రధాని మోదీ చిత్రపటం అందజేస్తున్న బీజేపీ రాష్ట్ర నాయ కులు విట్టా రమేష్

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి



మైనార్టీ కాలనీలో పర్యటిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కాశీంవలి అన్నారు. పట్టణంలోని మైనార్టీ కాలనీలో బుధవారం ఓటు చోరీ పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఓటు చోరీపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజా స్వామ్యంలో ఓటు విలువ ఎంతో విలువైందని, ఓటు చోరీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు హసిఫ్, షబ్బీర్, రఫిక్, అజయ్ పాల్గొన్నారు.

భయం వీడి హాస్టల్‌లో చేరండి



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అశోక్ నాయక్

మంత్రాలయం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రచ్చుమర్రి మోడల్ స్కూల్‌లో 9, 10, ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు భయం వీడి హాస్టల్‌లో చేరాలని కళాశాల ప్రిన్సిపల్ అశోక్ నాయక్ సూచించారు. పాఠశాలలో హాస్టల్ వినియోగంపై బుధవారం జిల్లా కౌన్సిలర్ జనార్దన్ రాజు, మనో వెంకట్, సుచరితలు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతిరోజు బాలికలు పాఠశాలలకు రావాలంటే బస్సు, ఆటో, బైకులపై రావడం, కష్టతరమైన పద్ధతి అని, ఆహ్లాదకరమైన వాతావరణం మధ్య హాస్టల్, పాఠశాల వాతావరణంలో ఉంటుందని తెలిపారు. ఆత్మవిశ్వాసంతో ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలని సూచనలు చేశారు. సమావేశంలో నళిని, భాగ్యలక్ష్మి, వైష్ణవి, ప్రసాద్, షరీఫ్, వలి, ఉరుకుందప్ప, సోమలింగం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటా



చెన్న బసప్పను సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు

కౌతాళం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పేదలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయపు ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ చెన్న బసప్ప అన్నారు. ఆయన జన్మదిన వేడుకలను కౌతాళంలోని స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు నాయకులు చెన్న బసప్పకు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్‌ను కట్ చేసి స్వీట్లు తినిపించుకున్నారు. చెన్నబసప్ప యూత్ సభ్యులు పీహెచ్‌సీలో రోగులకు, గర్భిణులకు, బాలింతలకు బ్రెడ్డు, పండ్లు బేబి కిట్లను పంపిణీ చేశారు. నాయకులు డమ్ములదిన్నె రమేశ్ గౌడ్, కుంటనహాల్ దొడ్డన గౌడ్, ఉరుకుంద కురుగోడు, సురేంద్ర, యూత్ సభ్యులు కాశీవిశ్వనాథ, చిరంజీవి, మంజునాథ, సిద్ధు, రాజాబాబు, రెహమాన్ ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రైతులకు యూరియా అందజేస్తున్న అడివప్ప గౌడ్

కౌతాళం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అడివప్ప గౌడ్ అన్నారు. మండలంలోని వల్లూరు గ్రామంలో బుధవారం వీఆర్వో మహదేవప్పతో కలిసి రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు సరిపడా ఎరువులను ప్రభుత్వం అందించేందుకు సిద్ధంగా ఉందని, ఎవరూ అధైర్యపడవద్దని తెలిపారు. ఇటీవల వర్షాలు అధికం కావడంతో రైతులు పండించిన పంటలకు అవసరమైన యూరియాను అందేలా అధికారుల దృష్టికి తీసుకుపోవడంతో అధికారులు స్పందించి సకాలంలో యూరియాను సరఫరా చేశారన్నారు. ఈ యూరియాతో ముఖ్యంగా వరి పంటలకు ఎంతో అవసరమన్నారు.

విశ్వకర్మ జయంతి వేడుకలు

మంత్రాలయం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో విశ్వ బ్రాహ్మణ సంఘం సభ్యులు విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి గంగ పూజ ధ్వజారోహణ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రహ్లాదాచార్, పవనేషాచార్, రాఘవేంద్రచార్, చంద్ర, సిద్ధ, సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌లో
వెదజల్లుతున్న దుర్గంధం

● పట్టించుకోని వ్యాపారులు, అధికారులు



మార్కెట్లో జంబో షెడ్డు పక్కన పేరుకుపోయిన మురుగు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌లో హోల్‌సేల్ కూరగాయలు క్రయవిక్రయాలు జరిగే ప్రాంతం కుళ్లిన కూరగాయల వ్యర్థాలతో దుర్గంధం వెదజల్లుతోంది. మార్కెట్‌లో ఉదయం నుంచి 11 గంటల వరకు కూరగాయల హోల్ సేల్ క్రయవిక్రయాలు జరుగుతాయి. వీటిని కొనుగోలు చేసేందుకు చిరు వ్యాపారులు మార్కెట్‌కు వస్తుంటారు. దీంతో ఉదయం మార్కెట్ క్రయ విక్రయదారులతో కిటకిటలాడుతోంది. అయితే మార్కెట్‌కు విక్రయానికి వచ్చే టమోటా, ఉల్లి, క్యాలీఫ్లవర్, క్యారెట్‌తో పాటు ఇతర కూరగాయలు, ఆకుకూరలు కొంత మేర మిగిలిపోవటం లేదంటే పాడైపోవటంతో వ్యాపారులు వాటిని విక్రయించే అవకాశం లేకపోవటంతో ఆ పక్కనే పారేస్తురు. వాస్తవంగా మార్కెట్‌లో క్రయ విక్రయాలు పూర్తి అయిన వెంటనే వ్యర్థాలను డంప్ యార్డుకు తరలించాలి. అలాగే మార్కెట్‌ను శుభ్రం చేయాలి. అయితే ఇక్కడ మాత్రం అలా జరగటం లేదు. వ్యాపారులు తమ వ్యాపారాలు పూర్తి అయిన వెంటనే మిగిలిపోయిన, పాడైపోయిన వాటిని మార్కెట్‌లోనే ఓ పక్కన పారేస్తున్నారు. అవి అక్కడే రోజుల తరబడి అక్కడే ఉండిపోవటంతో కుళ్లి కంపుకొడుతోంది. దీంతో మార్కెట్‌కు వచ్చే చిరు వ్యాపారులు, వినియోగదారులు ముక్కు మూసుకోవాల్సిందే. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే కూరగాయల వ్యర్థాలను తరలించి శుభ్రం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



మార్కెట్‌లో వదిలేసిన కూరగాయల వ్యర్థాలు



కుళ్లిపోవడంతో పారేసిన టమోటా, ఉల్లి బస్తాలు

జీడీపీ మునక భూముల్లో సర్వే

గోనెగండ్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో ఉన్న ఆయకట్టు భూములలో నీరు చేరి సాగు చేసిన పంటలు దెబ్బ తినడంతో రెండు రోజులుగా జీడీపీ ఇరిగేషన్ , రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. ఆయకట్టు భూములు గాజులదిన్నె ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలోని వరద నీటిలో తమ పొలాలు మునిగిపోయాయని, సర్వే నిర్వహించి పంట నష్టపరిహారం ఇవ్వాలని ఈ నెల 15న ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల గ్రామాలైన ఐరన్ బండ, ఎన్నెకండ్ల, నెరుడులప్ప, గోనెగండ్ల, గంజహళ్లి గ్రామాలకు చెందిన 20 మంది రైతులు కలెక్టర్‌ను కర్నూలులో కలిసి కోరారు. అందుకు స్పందించిన జిల్లా అధికారులు సర్వేలు జరిపి నివేదిక ఇవ్వాలని జీడీపీ అధికారులను, రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. దీంతో మంగళ, బుధవారాలలో జీడీపీ సిబ్బంది, సర్వేయర్ విజయప్రకాశ్, సిబ్బంది జీడీపీ ఎగువ భూములలో సర్వేలు చేపట్టారు. జీడీపీ ఎగువ ప్రాంతంలోని నీటి మునిగిన భూములు ప్రాజెక్టుకు చెందినవా? లేక రైతులకు చెందినవా? అని సర్వే చేపట్టారు. సర్వే అనంతరం నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులు పంపుతామని సర్వే సిబ్బంది తెలిపారు. ఆయకట్టు రైతులు మా ట్లాడుతూ ప్రసుతం ప్రాజెక్టునీటిని 376.60 మీటర్లుకు నిలపడంతో ఎగువ ప్రాంతంలో 100 ఎకరాల ఆయకట్టు మునిగిపోయిందని, పంటనష్టం చెల్లించాలని రైతులు కోరారు.



నీట మునిగిన పంట భూములను సర్వే చేస్తున్న అధికారులు

ఘనంగా ప్రధాని జన్మదిన వేడుకలు

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీలోని బీజేపీ కార్యాలయంలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వందమందికి పైగా యువకులు రక్తదానం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నాయకులు రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అక్కమ్మతోట రామకృష్ణ, జిల్లా కార్యదర్శి, కౌన్సిలర్ దయాసాగర్, నాయకులు గురురాజ దేశాయ్, బీఎల్ నారాయణ, రామన్న గౌడ్, జటప్ప, చరణ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం: కౌతాళంలో బీజేపీ మండల అధ్యక్షుడు యంకన్న ఆధ్వర్యంలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాని చిత్రపటాన్ని అందజేశారు. పీహెచ్‌సీలో రోగులకు బ్రెడ్డు, పండ్లను పంపిణీ చేశారు.



రక్తదానం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ

పంట ఉత్పత్తులను ప్రభుత్వమే కొనాలి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి) : పత్తి, వేరుశనగ, ఉల్లి పంటల ఉత్పత్తులను రైతుల నుంచి ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, హనుమంతులు డిమాండ్ చేశారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో బుధవారం ఆయన మాట్లాడుతూ పత్తి, వేరుశనగ, ఉల్లి పంటలు రైతులు ఎక్కువగా సాగు చేశారని చెప్పారు. అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయి రైతన్నలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పంట చేతికి వచ్చే సమయంలో వర్షాల ప్రభావం వల్ల పంట దెబ్బతిన్నాయన్నారు. పండిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు పశువులకు, గొర్రెలకు మేతగా వదిలేశారని చెప్పారు. ఇలాంటి పరిస్థితిలో ప్రభుత్వమే నేరుగా రైతన్నల దగ్గర ధాన్యాలను కొనుగోలు చేసి రైతును ఆదుకోవాలని కోరారు. రైతుల సమస్యల పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అబ్దుల్లా, రాఘవ రెడ్డి, బడెషావలి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి

● దళిత బహుజన సంఘాల నాయకులు
● మంత్రాలయంలో భారీ ర్యాలీ



డీటీకి వినతి పత్రం ఇస్తున్న దళిత బహుజన సంఘాల నాయకులు

మంత్రాలయం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో బీఆర్ అంబేడ్కర్ భవన నిర్మాణానికి రెండెకరాల స్థలాలు కేటాయించాలని దళిత బహుజన సంఘాల నాయకులు రామతీర్థం అమ్రేష్ డిమాండ్ చేశారు. బుధవారం మంత్రాలయంలో దళిత బహుజన సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో గడ్డం నాగేంద్ర, యేబు, దేవదాసు, కుమార్, ప్రభుదాస్ సమక్షంలో రాఘవేంద్ర సర్కిల్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ జీకే గురురాజరావుకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అనగారిన వర్గాల ప్రజలకు సాంఘిక, ఆర్థిక సాంస్కృతిక కమ్యూనిటీ, విద్యకు ఉపయోగపడే విధంగా తక్షణమే రెండెకరాలు భూమిని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు చార్లెస్, ప్రసన్న శివ, తిమ్మప్ప, ప్రభుదాస్, ఆనోక్, రవి, ఈరన్న, లక్ష్మన్న, రాజుపాల్గొన్నారు.

'నా స్థలంలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు'

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): వాల్మీకి విగ్రహాన్ని తన సొంత స్థలంలో ఏర్పాటు చేశారని కడిమెట్ల గ్రామానికి చెందిన తిరుమలరెడ్డి బుధవారం తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ నా సొంత స్థలంలో వాల్మీకి విగ్రహాన్ని నా అనుమతి లేకుండా ఏర్పాటు చేశారన్నారు. కేవలం తాను టీడీపీకి మద్దతు ఇచ్చానన్న కారణంతోనే వైసీపీ నాయకులు విగ్రహాన్ని ఏర్పాటు చేయించారని ఆరోపించారు. అనుమతులు ఎలా ఇచ్చారని తహసీల్దార్‌ను ప్రశ్నించగా.. ఎలాంటి అనుమతి ఇవ్వలేదని చెప్పారని తిరుమలరెడ్డి తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు స్థల పరిశీలన

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మునెప్ప నగర్, రాధకృష్ణ కాలనీ, పంపన్న గౌడ్ కాలనీలలో ఓల్టేజ్ సమస్యను తీర్చేందుకు కొత్తగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు ఏఈ ప్రసన్న కుమార్ బుధవారం స్థలాన్ని పరిశీలించారు. ఆయా కాలనీలలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. త్వరలో లో ఓల్టేజి సమస్యను తీర్చేందుకు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏఈ తెలిపారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు మాచాని మహేశ్, నాయకులు బుగిడే నాగరాజు, మహబూబ్ బాషా, సురేశ్, విశ్వనాథ్, సురేంద్ర పాల్గొన్నారు.

జనసేన బలోపేతానికి కృషి

మంత్రాలయం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో జనసేన పార్టీని బలోపేతం చేసి ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా చూద్దామని ఆ పార్టీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి బి.లక్ష్మన్న అన్నారు. బుధవారం లక్ష్మన్నను కౌతాళం మండల జనసేన నాయకులు కలిశారు. పార్టీ ప్రణాళిక, అభివృద్ధి, కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఎర్రిస్వామి, ఉమాపతి, శివ, అయ్యప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లిని ముందస్తుగా కోయవద్దు: ఏడీఏ

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉల్లి పంట దాదాపు 100రోజుల నుంచి 110 రోజులకు మాత్రమే కోతకు వస్తుందని, అలా కాకుండా ముందస్తుగా కోయవద్దని ఏడీఏ మహ్మద్ ఖాద్రీ సూచించారు. కందనాతి గ్రామంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని ఏవో శివశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ ఉల్లి గడ్డ పరిపక్వతకు వచ్చిన తరువాతే కోత కోయాలని, సైజు, నాణ్యత ఉండి ఆరబెట్టుకొని తీసుకువెళ్లాలని సూచించారు. గురువారం, శుక్రవారం మాత్రమే ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌కు ఉల్లిని తీసుకెళ్తే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేస్తారన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు రసూల్, వినోద్, వీఏఏ కావ్య, షరీఫ్ పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

పెద్దకడబూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబళదిన్నె గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, రవి కుమార్ పోషకాహారంపై అవగాహన కల్పించారు. బుధవారం రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, బాలింతలు, గర్భిణుల్లో పోషకాహార లోపాన్ని నివారించడానికి పోషణ్ మాసం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ పిల్లల సంరక్షణలో తల్లిదండ్రులు భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు బసమ్మ, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాఘవేంద్రుడి నిజ బృందావన దర్శనం



అలంకరణ లేని రాఘవేంద్రస్వామి బృందావనం

మంత్రాలయం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో జరిగే నిత్యపూజలకు విరామం కల్పించారు. బుధవారం ఏకాదశి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, టెంకాయకొట్టడం, పరిమళ ప్రసాదం బంద్ చేశారు. దీంతో మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం నిర్వహించి, మహ మంగళ హారతులు ఇచ్చారు. పూర్ణబోధ పూజ మందిరంలో సంస్థాన పూజచేసి భక్తులకు తప్త ముద్రధారణ చేశారు. అలంకరణ లేని రాఘవేంద్ర స్వామి నిజ బృందావనాన్ని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

జీడీపీ గేట్లు మూసివేత



ప్రాజెక్టు గేట్లను మూసివేసిన దృశ్యం

గోనెగండ్ల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు గేట్లను ఇరిగేషన్ అధికారులు మంగళవారం రాత్రి మూసివేశారు. దాంతో హంద్రీనదికి నీటి సరఫరా నిలిచిపోయింది. మూడు రోజులుగా వరద నీరు వచ్చి చేరడంతో నీటి విడుదల కొనసాగింది. అయితే ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి 100 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం గాజలదిన్నె ప్రాజెక్టులో నీటి మట్టం పూర్తి స్థాయిలో ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. బుధవారం సాయంత్రానికి నీటి మట్టం 376.80 మీటర్లు ఉంది. దీంతో జీడీపీ నిండుకుండలా మారింది. జీడీపీ పూర్తిస్థాయి నీటి మట్టం 377 మీటర్లు అయితే ప్రస్తుతం కేవలం 0.20 మీటర్ల మాత్రమే తక్కువ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టులో నీరు సామర్థ్యానికి తగ్గట్టుగా పూర్తిగా ఉందని, ఇప్పటి నుంచి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీటని ఎప్పటి కప్పుడు దిగువకు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. రబీ సీజన్‌లో జీడీపీ ఆయకట్టు రైతులుకు నీటి ఇబ్బంది లేకుండా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఘనంగా సురవరం సంస్మరణ సభ



సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న వామపక్షాల నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని సీపీఐ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యుడు సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, కాంగ్రెస్ నాయకులు కాశీంవలి, టీడీపీ నాయకుడు ఆదెన్న, హేమంత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొని పార్టీలో తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. సీపీఐ నాయకులు పంపన్నగౌడ్, మల్లెల జీవన్ సుశీల్, ఎన్టీయూ నాయకులు, ఏపీయూడబ్ల్యూజే, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలి

గోనెగండ్ల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని డీఎల్‌డీవో బాలకృష్ణారెడ్డి సూచించారు. మండలంలోని కన్నూరు గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. అక్కడ ఉన్న మహిళలతో మాట్లాడి ఐవీఆర్ఎస్ కాల్స్ గురించి వివరించారు. గ్రామాలలో పారిశుధ్య పనులు సక్రమంగా జరగడం లేదని ఫిర్యాదు అందడంతో పరిశీలించడానికి వచ్చినట్లు తెలిపారు. వీధులను పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ అధికారులకు సూచించారు. అనంతరం సచివాల సిబ్బందితో సమావేశం నిర్వహించి అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పారిశుధ్యానికి ప్రాధాన్యం

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని, మహాత్మా గాంధీ జయంతి, దసరా సందర్భంగా స్వచ్ఛతా హీ సేవ ప్రత్యేక కార్యక్రమాలను అక్టోబరు 2వ తేదీ వరకు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలను బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో విడుదల చేశారు. కమిషనర్ మాట్లాడుతూ మలీన ప్రదేశాలను శుభ్రం చేయడం, మార్కెట్లు, దేవాలయాలు, పార్కుల పరిశుభ్రత, సఫాయి మిత్ర సురక్ష, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం తగ్గించడం అవగాహన ర్యాలీలు, ప్రతిజ్ఞ, శ్రమదానంలో ప్రజలను భాగస్వాములను చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టీపీవో రాజేశ్, డీఈ నీరజ, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

నందవరం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తడిచెత్త, పొడిచెత్త నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే పంచాయతీ సిబ్బందిపై చర్యలు తప్పవని డివిజనల్ పంచాయతీ అధికారి తిమ్మక్క హెచ్చరించారు. మండలంలోని కనకవీడు గ్రామంలో బుధవారం అదనపు ఎంపీడీవో సందీప్, పంచాయతీ అధికారి రామారావు ఆధ్వర్యంలో ఇంటింటా తిరిగి పొడిచెత్త, తడిచెత్తల గురించి వివరించారు. ఆమె మాట్లాడుతూ చెత్త నుంచి ఎరువును తయారు చేయవచ్చని అన్నారు. దీంతో పంచాయతీకి ఆదాయం కూడా వస్తుందన్నారు. ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ఉండాలంటే ఇళ్ల దగ్గర చెత్తను పాడేయకుండా హరిత రాయబారులు తెచ్చే బండ్లలో వేయాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలన్నారు. డ్రైనేజీల పనులను పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. టీడీపీ నాయకులు ఈరన్న, సామేలు, రాముడు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.